
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 22.04.2016, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 47 పేజీలు : 16, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



# కలిస్తే గెలుస్తారు?



○ మారుతున్న కులాల సమీకరణం ○ కాపులు ఎటు మొగ్గితే... అటే అధికారం

***ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను కుల సమీకరణలు ప్రభావితం చేసిన సందర్భాలు గతంలో లేవు. కాని 2014 ఎన్నికల నుండే చరిత్ర మారింది. విభజన తర్వాత జరిగిన 2014ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై కులం ముద్ర స్పష్టంగా కనిపించింది. రెడ్డి, కమ్మ, కాపు... ఈ మూడు కులాలలో ఏ రెండు కులాలయితే కలుస్తాయో... వారివైపే గెలుపుంటుంది. 2014ఎన్నికల్లో జరిగిందిదే!***

రాజకీయ చరిత్రలో ఏనాడు కలవని కాపు, కమ్మ వర్గాలు ఆ ఎన్నికల్లో కలిసాయి. కాపులు తెలుగుదేశం వైపు మొగ్గుచూపడంలో సినీహీరో పవన్ కళ్యాణ్ ప్రభావం ఎక్కువుగా వుందని చెప్పవచ్చు. చంద్రబాబు రాజకీయ మేధావి, అనుభవజ్ఞుడు. కాబట్టే ముందుగా పవన్ కళ్యాణ్‌ను పట్టుకుని, కాపులకు ఒక ఉపముఖ్యమంత్రి పదవి అని ఎరవేసి వారి ఓట్లను కొల్లగొట్టగలిగాడు. జగన్‌కు రాజకీయంగా అన్ని తెలివితేటలు లేవు. అదీగాక అనుభవ రాహిత్యం ఒకటి. అలాగే నేను అధికారంలోకి వస్తానన్న ధీమా కొంచెం ఎక్కువై వుండింది. ఇక్కడే అతను దెబ్బతిన్నాడు. గతాన్ని వదిలిపెడితే రేపు జరగబోయేదేంటన్నది ప్రశ్న? (మిగతా 2వ పేజీలో)

## మరపురాని.. మరువలేని.. మధురమైన... జ్ఞాపకాల సంతకం లాయర్ పెళ్లిపుస్తకం

8,9లో



ఈ నెల 15వ తేదీ నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన 'లాయర్' శ్రీరామనవమి సంబరాలలో 'పెళ్లిపుస్తకం'ను ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

## ఖరారైన చేరిక

### నెల్లూరే వేదిక



**నెల్లూరుజిల్లా రాజకీయాలలో ఇప్పు డొక స్టార్ అట్రాక్షన్‌గా మారిన సేవాభిలాషి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలుగుదేశంపార్టీలో చేరడం ఖాయమైపోయింది.**

2014కు ముందు వైకాపాలో చేరిన ఆయన జిల్లాలో ఆ పార్టీ అభ్యర్థుల గెలుపుకు తనవంతు కృషి చేశాడు. ఆ ఎన్నికల్లో వైకాపా అధికారంలోకి రాకున్నా, ఆయన అక్కడే వుండిపోయాడు. (మిగతా 2వ పేజీలో)




## మంత్రి వర్గంలో... మొద్దబ్బాయ్



### > పనితీరుకు ఫెయిల్ మార్కులు

***అది ఇంటర్మీడియట్ అయినా, ఎంసెట్ అయినా, ట్రిబుల్ ఇ అయినా, ఐఐటి అయినా... నారాయణలో చదివిన విద్యార్థులకు ఫస్ట్ ర్యాంకులు వస్తుంటాయి. అదేం ఖర్మోగాని దేశంలో ఎన్నో వేలమంది ర్యాంకర్లను తయారుచేసిన నారాయణ మాత్రం మంత్రిగా తన పని తీరులో ర్యాంకును తెచ్చుకోలేకపోయాడు. అది కూడా మంత్రివర్గంలో చిట్టచివరి ర్యాంకును పొంది, ర్యాంకులు రానప్పుడు తన విద్యార్థులు పడే బాధ ఎలా ఉంటుందో చవిచూశాడు.***

చంద్రబాబు పాలనలో పనితీరు ఆధారంగా మంత్రులకు, ఎమ్మెల్యేలకు ర్యాంకులు కేటాయిస్తుంటారు. ఈ ర్యాంకుల కేటాయింపుకు ప్రత్యేక దళం కూడా ఉంటుంది. తాజాగా మంత్రులకు ప్రకటించిన ర్యాంకుల్లో పీతల సుజాతకు ఫస్ట్ ర్యాంకు రాగా, పి.నారాయణకు చిట్టచివరి ర్యాంకు వచ్చింది. పనితీరు ఆధారంగా కొలిస్తే నారాయణ అందరికన్నా ఎక్కువే కష్టపడుతున్నాడు. చంద్రబాబు కన్నా ఓ గంట తక్కువ నిద్రపోయి, ఓ గంట ఎక్కువే పనిచేసి వుంటాడు. రియల్ రాజధానికి భూముల సేకరణలో నారాయణ కీలకపాత్ర పోషించాడు. తనకిచ్చిన మున్సిపల్ శాఖను సమర్ధవంతంగా నిర్వర్తించలేదుగాని, మిగిలిన (మిగతా 2వ పేజీలో)

# సంస్మరణ



**కీ॥శే॥ బోగొల్లు నారాయణరెడ్డి గారు**

నిర్యాణం: 23-4-1995 వర్ధంతి: 23-4-2016

మా తండ్రి

**బోగొల్లు నారాయణరెడ్డి గారి**

21వ వర్ధంతి సందర్భంగా

వారి పవిత్ర ఆత్మకు

శాంతి చేకూరాలని ఆశిస్తూ...

**బి.మోహన్‌రెడ్డి** Architect & Engineer

**Mohan Architects (P) Ltd.,**

Chennai

ఫోన్: 044-24510157

మరియు

కుటుంబసభ్యులు


# ఉగ్ర నరసింహుడు ఊరుకుంటాడా?

- దుర్మార్గులను రక్షిస్తారా? శిక్షిస్తారా?
- టేకు నిందితుల్లో ఒకరు లొంగుబాటు

ప్రజల భూములని లేదు... ప్రభుత్వ అసైన్‌మెంట్‌లని లేదు... వాగులు, కాలువలు లెక్కేలేదు... ఏ భూమినైనా ఆక్రమించేయ డమే. ఇసుక రీచ్‌లు... గ్రావెల్ క్వారీలు... వాళ్ల దోపిడీకి అడ్డే లేదు. ఇంతకాలం ప్రజలను, ప్రభుత్వ ఆస్తులను వదిలిపెట్టకుండా కుమ్మేసారు. దేశాన్నే దోచేవాళ్లకు దేవుడొక లెఖ్ఖా... అన్నట్లు ఇప్పుడు దేవుడి సొమ్ము మీద కూడా పడ్డారు... వాళ్ళే వేమిరెడ్డి హంసకుమార్‌రెడ్డి మరియు వారి కుమారులు. నెల్లూరురూరల్ నరసింహపురం ఏరియాలో వీళ్లాడిందే ఆట, పాడిందే పాట. వీరి అక్రమాలకు అంతూ పొంతూ ఉండేది కాదు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో దూరడం, అధికారం అండతో తమ దౌర్జన్యకాండను సాగించడం వీరి నైజం. 2014ఎన్నికలకు ముందు వైకాపా అధికారంలోకి వస్తుందనే ఆశతో ఆ పార్టీలో చేరారు. ఇటీవల ఆ పార్టీని వదిలి ఆదాల ప్రభాకర్‌రెడ్డి నాయ కత్వంలో తెలుగుదేశంలో చేరారు. ఇదంతా కూడా అధికార ప్రాపకం కోసమే!

ఇన్నేళ్లుగా ప్రజలతో పెట్టుకున్నారు, ప్రభుత్వంతో పెట్టుకు న్నారు. అంతవరకు ఒకే... ఇప్పుడు పోయి పోయి వేదగిరి నర సింహస్వామితో పెట్టుకున్నారు. ఆయన సొమ్ముకే ఎసరు పెట్టారు. వేదగిరి నరసింహుడు ఉగ్రనరసింహావతారమెత్తినట్లున్నాడు... తన శక్తిని చూపిస్తున్నాడు.

శ్రీ వేదగిరి నరసింహస్వామి దేవస్థానంకు చెందిన 30.12 ఎకరాల భూముల్లో టేకు చెట్లు నరికివేత వ్యవహారం వేమిరెడ్డి హంస కుటుంబం మెడకు బాగానే చుట్టుకుంది. తహశీల్దార్‌ను మెయింటెన్ చేసి ఎన్ఓసి తెచ్చుకుని, ఆ కాపీ చూపి ఫారెస్ట్ అధికారులను మభ్యపెట్టి 290 టేకు చెట్లను, 25వేప, 10కొబ్బరి చెట్లను నరికారు. ఆలయ భూముల్లో టేకు చెట్ల నరికివేత జరుగుతున్నా, సంబంధిత అధికారులు చాలా ఆలస్యంగా మేలుకున్నారు. టేకు దుంగలు టింబర్ డిపోలకు తరలిపోయాక ఆలయ ఇ.ఓ పాయసం నాగేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ సంఘ టనపై నెల్లూరురూరల్ పోలీసులు వేమిరెడ్డి హంసకుమార్‌రెడ్డి, ఆయన ఇద్దరు కుమారులతో పాటు టేకు చెట్లు కొన్న వ్యాపారిపై కూడా కేసు నమోదు చేశారు. అయితే ఎఫ్ఐఆర్ కాపీలో వేప, కొబ్బరి తదితర చెట్లను నరికేసారని పేర్కొని, టేకు చెట్లను చేర్చకపోవడం కూడా వివాదాస్పదమైంది. అధికారపార్టీకి చెందిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఒత్తిడితోనే ఎఫ్ఐఆర్‌లో టేకు చెట్లు చేర్చ లేదని విమర్శలు వచ్చాయి. అయితే ఎస్పీ విశాల్‌గున్ని దీనిని ఖండించారు. కేసు విషయంలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవని, నిందితులను వదిలేది లేదని ఆయన ఘంటాపథంగా చెప్పారు కూడా! దేవాదాయ శాఖ కమి షనర్ అనూరాధ ఈ విషయంలో చాలా సీరియస్‌గా ఉన్నట్లు తెలు స్తోంది. చెట్లకు 3లక్షల లెక్కన



లొంగిపోయిన హరిశివారెడ్డి

మొత్తం 9కోట్లు దాకా జరిమానా వసూలు చేయాలని ఆమె ఆదేశించినట్లు తెలుస్తోంది.

వేదగిరి నరసింహస్వామి అంటే... నెల్లూరురూరల్ నాయకు లందరికీ సెంటిమెంట్. దేవుడి సొమ్మునే కాపాడలేకపోతే ఇక ప్రజల సొమ్మును తామేమి కాపాడగలమని నాయకులు ప్రశ్నించుకుంటున్నారు. ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈ కేసు విషయమై గుంటూరు ఐజితో మాట్లాడి నిందితులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదలొద్దని, ఇలాంటి వారివల్ల పార్టీకే చెడ్డపేరొస్తుందని చెప్పారు. నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈ సంఘటనపై చాలా సీరియస్‌గా వున్నారు. మరోసారి ఇలాంటివి జరగకుండా దోషులను శిక్షించేలా చర్యలు ఉండాలం టున్నారు. దేవస్థానం మాజీఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి సైతం నిందితులపై కఠిన చర్యలు తీసుకుని, దేవుడి సొమ్మును కాపాడాలని కోరుతున్నారు. ఈయన ఎంతోకాలం ఈ దేవస్థానం ఛైర్మెన్‌గా పని చేశారు. దేవస్థానం అభివృద్ధికి కృషి చేసారేగాని, స్వామి సొమ్మును రూపాయి కూడా వృధాకానివ్వలేదు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా వున్న వేమిరెడ్డి హరిశివారెడ్డి మంగళవారం పోలీసుల కళ్లు గప్పి కోర్టులో లొంగిపోయాడు. నిందితులను పట్టుకునేందుకు పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి గాలింపులు జరుపుతున్నా కోర్టు వద్ద తమను అడ్డుకోబోయిన కానిస్టేబుల్‌ను కూడా నెట్టేసి హరిశివారెడ్డి నాటకీయంగా కోర్టులో లొంగిపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఇప్పుడు అందరి సంశయం ఒక్కటే... అధికారపార్టీలో ఉన్నారు కదా అని చంద్రబాబు టేకు నిందితులను రక్షిస్తాడా? లేక ఇలాంటి వారికి తన పార్టీలో స్థానం లేదనే విధంగా శిక్షి స్తాడా? ఏం జరుగుతుందో చూద్దాం!

## కలిస్తే గెలుస్తారు?

(మొదటి పేజీ తరువాయి)

2019ఎన్నికల్లో తాను క్రియాశీలకంగా వ్యవహరిస్తానని పవన్ కళ్యాణ్ ప్రకటించాడు. ఏ విధంగా తన రాజకీయ పయనము టుందనేదానిపై మాత్రం ఆయన స్పష్టత ఇవ్వలేదు. ప్రస్తుతం ఆయనకు తెలుగుదేశం, బీజేపీలతో మైత్రి వుంది. రాష్ట్ర రాజకీయాల పరంగా ఆయన తెలుగుదేశంతోనే కొనసాగితే, కాపులు ఈసారి ఆయనకు కూడా దూరమయ్యే అవకాశముంది. కాపులు ఇప్పటికే తెలుగుదేశంపై వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. కాపు రిజర్వేషన్‌ల ఉద్యమంతో పాటు వంగవీటి రంగా విగ్రహ ధ్వంసం వంటివి కాపుల్లో కలత రేపాయి.

ఇటీవలకాలంలో కాపులను జగన్ బాగానే దువ్వుతున్నాడు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారిని రెచ్చగొట్టడంలో వైకాపా పాత్రను విస్మరించలేం. అంతేకాకుండా కృష్ణ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కాపు నాయకులకు దివంగత నేత వై.యస్. రాజశేఖరరెడ్డితో సత్సంబంధాలుండేవి. కాని జగన్ ఆ సంబంధా లను నిలబెట్టుకోలేకపోయాడు. ఈ మూడు జిల్లాల్లో కాపులను రాబట్టుకోగలిగితే ఇక్కడ జగన్‌కు తిరుగుండదు.

అయితే ఇక్కడ అసలు మెలిక పవన్ కళ్యాణ్‌తోనే! పవన్ జగన్‌తో కలిస్తే వైకాపాకు తిరుగుండదు. కాపులు, రెడ్లతో పాటు ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు జమపడుతాయి. అలాకాకుండా పవన్ తెలుగుదేశంతో విడిపోయి సొంతంగా పోటీచేస్తే రాష్ట్ర రాజ కీయాలు ముదుముక్కలాటగా మారతాయి. రెడ్లు, కాపు, కమ్మ... మూడు పార్టీల మధ్య చీలుతారు. ఈ విధమైన పోటీ ఏర్పడితే మళ్ళీ చంద్రబాబే ప్రయోజనం పొందుతాడు. ఇలా కాకుండా పవన్, చంద్రబాబుతోనే కొనసాగితే జగన్‌కు లాభమే. ఎందుకంటే చంద్రబాబుతో వుంటే ఈసారి పవన్‌ను కాపులు నమ్మరు. కాబట్టి వాళ్ళు జగన్ వైపు మొగ్గు చూపొచ్చు. అలాకాకుండా పవన్, జగన్ కలిస్తే ఆ కాంబినేషన్ హిట్టయ్యే అవకాశముంది. ఇవేవీ లేకుండా పవన్ ఒంటరిగా పోటీ చేస్తే మాత్రం జగన్ నెత్తిన యాసిడ్, బాబు నెత్తిన బూస్ట్ పోసినట్లే!

## ఖరారైన చేరిక

(మొదటి పేజీ తరువాయి)

అయితే ఇటీవల పార్టీ అధిష్టానం పట్ల మనస్తాపం చెందిన ఆయన ఆ పార్టీని వీడాలనుకున్నాడు. త్వరలో ఆ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో తెలుగుదేశంపార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు. ఈమేరకు ఈనెల 19వతేదీన హైదరాబాద్‌లో సీఎం చంద్రబాబును కలిసి చర్చించారు. ఈ నెల 27న చంద్రబాబు నెల్లూరుజిల్లా పర్యటనకు రానున్నారు. అయితే వైఎస్ఆర్ పార్టీలో చేరడం ఆరోజే ఉంటుందా లేక ప్రత్యేకంగా ఇంకోరోజు పెడతారా అన్నది ఖరారు కావాలి. కాకపోతే వైఎస్ఆర్ సైకిల్ ఎక్కడం మాత్రం ఖరారైపోయింది.

## మొద్దబ్బాయ్

(మొదటి పేజీ తరువాయి)

చాలా శాఖల్లో వేలు పెట్టి ఆ మంత్రులు చెయాల్సిన పనులను కూడా నారాయణ చేశాడు. పనిపరంగా చూస్తే నారాయణ చాలా కష్టపడుతున్నాడు. కాబట్టి పనితీరు ఆధారంగా ర్యాంకు ఇస్తే టాప్‌లో వుండాలి. కాని ఫలితాల ఆధారంగా ర్యాంకు ఇచ్చినట్లున్నారు. అందుకే ఫ్లాప్ అయ్యాడు.

నారాయణ ర్యాంకుకు ఇంకో కారణం కూడా వుండొచ్చు. నెల్లూరుజిల్లా నుండి ఇంకొకరిని మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశాలున్నాయంటున్నారు. నారాయణ సమర్థవంతంగా పని చేస్తున్నాడు అని ర్యాంకు ఇస్తే రెండో మంత్రిని తీసుకోలేరు. అదిగాక మంత్రిగా నారాయణ ఉన్నాడనేగాని జిల్లా పార్టీకి రాజకీయంగా ఉపయోగపడడం లేదు. ఒక రకంగా ఈ జిల్లా వాడిగా నారాయణ మంత్రిగా వున్నప్పటికి ఈ జిల్లాకు మంత్రి లేనట్లే లెఖ్ఖ! నారాయణ రాజకీయాలకు పనికిరాడు. కాబట్టి జిల్లా నుండి రాజకీయ నాయకులనే మంత్రివర్గంలోకి తీసుకోవాలి. అందుకే నారాయణపై అసమర్థ మంత్రిగా ముద్రవేసి ఆయనను సిఆర్‌డిఏకు పరిమితం చేసేందుకు ఈ చివరిర్యాంకు ఇచ్చి ఉం డొచ్చు. నారాయణకు చివరి ర్యాంకు ఇవ్వడంతోనే నెల్లూరుజిల్లా నుండి ఇంకొకరికి మంత్రి ఛాన్స్ ఉందనేది అర్థమైపోతోంది.



# ఆ అమ్మకు బిడ్డలా...

కన్నబిడ్డలే తల్లిదండ్రులను రోడ్డున వదిలేసి పోతున్న ఈరోజుల్లో తనకు అమ్మ కాకున్నా ఓ వృద్ధురాలికి బిడ్డలా అండగా నిలిచాడు నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. మానవత్వంతో సాటి మనిషిని ఆదుకోవడానికి కోట్లు అవసరం లేదని, మంచి మనసుంటే మార్గం తప్పకుండా ఉంటుందని నిరూపించాడు. నెల్లూరు పొదలకూరు రోడ్డులోని జడ్పీ హైస్కూల్ ప్రాంతంలో ఏ ఆదరణ లేని షేక్ గౌసున్నీషా అనే వృద్ధురాలికి 15వేల రూపాయలతో బంకు పెట్టించారు. 19వ తేదీ దీనిని ప్రారంభించడమే కాక, వ్యాపారం చేసుకునేందుకు ఆమెకు మరో 5వేల రూపాయల డబ్బు కూడా ఇచ్చాడు కోటంరెడ్డి. ఇటీవల ఆయన జడ్పీ హైస్కూల్‌లో వాకర్స్ సమావేశానికి వెళ్లినప్పుడు గౌసున్నీషా తన బాధలు చెప్పుకుంది. వెంటనే స్పందించిన కోటంరెడ్డి ఆమెకు బ్రతుకుదెరువు కల్పించడానికి కృషి చేశారు.

# పి.ఆర్ ఎంప్లాయిస్ నెల్లూరుయూనిట్



కొత్త కార్యవర్గానికి నియామకపత్రం అందజేస్తున్న ఎన్నికల పరిశీలకులు

పంచాయితీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నెల్లూరు తాలూకా యూనిట్ నూతన కమిటీని ఈ నెల 17న నెల్లూరు జడ్పీ సమావేశమందిరం నందు జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వి.రజనీకాంత్, ఉపాధ్యక్షులుగా డి.సునీల్, కార్యదర్శిగా ఆర్‌సిఎస్ వర్మ, సంయుక్త కార్యదర్శిగా ఆర్.చిట్టిబాబు, కోశాధికారిగా వి.శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ కౌన్సిల్‌గా యస్.సులోచన, యం.సునీల్‌లను ఎన్నుకున్నారు. టి.గోపీనాథ్, టి.శ్రీనివాసులురెడ్డి, లక్కాకుల పెంచలయ్యలు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు.

# 30న శ్రీశ్రీ జయంతి సభ

మహాకవి శ్రీశ్రీ 107వ జయంతి సభను ఈనెల 30వతేది సాయంత్రం 5గంటలకు నెల్లూరులోని రేబాల లక్ష్మీనరసారెడ్డి (జూనియర్) పురమందిరంలో నిర్వహిస్తామని స్థానిక అభినయ ఆర్ట్స్ అధ్యక్షులు, ప్రముఖ రచయిత సిఆర్ రాఘవ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటయ్యే సభకు శాసనమండలి సభ్యులు విఠపు బాలసుబ్రహ్మణ్యం, శ్రీశ్రీ ప్రగతి ట్రస్ట్ గౌరవాధ్యక్షులు కాళిదాసు పురుషోత్తం, జిల్లా తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షులు చెలంచర్ల భాస్కరరెడ్డి తదితరులు పాల్గొంటారని, ఈ సందర్భంగా శ్రీశ్రీ రచించిన సినీ సంగీత గేయాలను ప్రముఖ గాయనీగాయకులు ఆలపిస్తారని తెలిపారు. మానవుడే నా సందేశం.. మనుష్యుడే నా సంగీతం అని ఎలుగెత్తి చాటిన మహాకవి శ్రీశ్రీ జయంతిని పురస్కరించుకుని కవితాపఠనం వుంటుందని, మహాప్రస్థాన గీతాల ఒరవడితో కవితలు వినిపించేందుకు కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు విచ్చేయాలని ఆయన కోరారు. ఈ కవితా పఠనంలో పాల్గొనదలచినవారు వారి స్వీయ కవితలను ఏప్రిల్ 25వ తేదీ లోగా తమకు అందజేయాలని, వివరాలకు ఫోన్ నం. 9440675070 ను సంప్రదించాలని ఆయన కోరారు.

## వయసులో చిన్నోడు...

# మానవత్వంలో మనసున్నోడు!

- సేవాస్ఫూర్తిని చాటిన మాగుంట శరత్‌చంద్రారెడ్డి జన్మదిన వేడుకలు
- రికార్డు స్థాయిలో 240 మంది రక్తదానం




రక్తదానం చేస్తున్న మాగుంట శరత్‌చంద్రారెడ్డి



రక్తదాన శిబిరానికి విచ్చేసిన జడ్పీ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, తుంగా శివప్రభాత్‌రెడ్డి, మాగుంట వెంకటనారాయణరెడ్డి

పుట్టినరోజంటే శుభాకాంక్షలు చెప్పుకోవడం, చాక్లెట్లు పంచుకోవడం, కేక్‌లు కోసుకోవడం, రాత్రికి మందుపార్టీలు చేసుకోవడం... చాలావరకు చాలామంది చేసే పని ఇదే! కాని మన పుట్టిన రోజంటే మనం ఆనందించే రోజు కాదు, మనతో పాటు పదిమందిని ఆనందంగా ఉంచే రోజు... సమాజానికి ఉపయోగపడే రోజు...

తన పుట్టినరోజును సేవకు ప్రతీకగా మలచి చిన్న వయసులోనే మానవత్వానికి ప్రతిరూపంగా నిలిచాడు నెల్లూరు, సరస్వతీనగర్‌కు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ మాగుంట వెంకటనారాయణరెడ్డి కుమారుడు మాగుంట శరత్‌చంద్రారెడ్డి. గత కొంతకాలంగా మాగుంట శరత్ చంద్రారెడ్డి యువజన సేవాసమితి ద్వారా నగరంలో ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించిన ఆయన, ఈ నెల 15వ తేదీన తన 29వ పుట్టినరోజును మరచిపోలేని ఓ మహత్తర మానవీయ కార్యక్రమంగా మలిచాడు. శరత్ చంద్రారెడ్డి పుట్టినరోజు సందర్భంగా నగరమంతా ఆయన మిత్రులు భారీఎత్తున ఫ్లెక్సీ కటౌట్‌లు, వాల్‌పోస్టర్‌లు అంటించారు. ఇది కేవలం వారి అభిమానానికి గుర్తు. అయితే అతిపెద్ద సేవా కార్యక్రమానికి ఆరోజు టౌన్‌హాల్ వేదికైంది. ఇక్కడ శరత్‌చంద్రారెడ్డి మిత్రులు ఏర్పాటు చేసిన భారీ రక్తదాన శిబిరం నెల్లూరులో రికార్డు సృష్టించింది. ఈ క్యాంప్‌లో శరత్‌చంద్రారెడ్డి మిత్రులు దాదాపు 240మంది రికార్డు స్థాయిలో రక్తదానం చేశారు. ఇంతమంది రక్తదానం చేయడం చూసి రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు వాళ్లే ఆశ్చర్యపోయారు. సాయి యూత్ ఈ రక్తదాన శిబిరం నిర్వహణలో కీలకపాత్ర పోషించింది. శరత్‌చంద్రారెడ్డితో వున్న స్నేహం, ఆయనపై వున్న అభిమానమే ఇంతమందిని రక్తదానానికి పురికొల్పింది. ఈ రక్తదాన శిబిరానికి జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీఛైర్మెన్ వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, మురళీకృష్ణ హోటల్స్ అధినేత వీరిశెట్టి హాజరత్‌బాబు, మాగుంట వెంకటనారాయణరెడ్డి హాజరై శరత్‌చంద్రారెడ్డిని అభినందించారు. పుట్టినరోజును సేవాస్ఫూర్తికి అర్థంగా మలచిన శరత్‌చంద్రకు 'లాయర్' అభినందనలు.

## 'ప్రభా'తం

మండే కాలం మండుకొస్తున్నా, నీటి ఎద్దడి తరుముకొస్తున్నా.. ప్రజలంతా నీళ్లో రామచంద్రా అంటూ అల్లాడిపోతున్నా.. అదేమిటో తెలియదు కానీ మన ప్రభుత్వాలు మాత్రం నింపాదిగానే వుంటాయి. దాహమైనప్పుడే బావి తవ్వుకుందామనే చందంగా వున్న మన కార్యాచరణ పథకాలు తీరా అచరణలోకి వచ్చేసరికి ఎండాకాలం కాస్తా మండిపోయి, వానలు వరదలు ముంచు కొచ్చేస్తుంటాయి. ఇక వేసవి సంగతి అంతటితో సరి. భారతావని ఇప్పుడు మండుటెండల్లో భగ్గుమంటోంది. ప్రతి ఏటా అంతకంతకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోవడమే కానీ, తగ్గడమనేదే వుండడం లేదు. రాష్ట్రంలోనైతే ఈ పరిస్థితి మరింత దారుణంగా వుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన జలాశయాల్లో నీరు అడుగంటిపోతున్నాయి. నీటి వనరులన్నీ ఎండిపోతున్నాయి. శ్రీశైలం, నాగార్జునసాగర్, తుంగభద్ర వంటి జలాశయాల పరిస్థితీ అంతే..కృష్ణా బేసిన్‌లోని నీటి ప్రాజెక్టుల దుస్థితీ ఇంతే. చెరువులు దొరువులు, వాగులు వంకలన్నీ ఎండిపోయాయి. నదీనదాల్లో నీటి చుక్క కానరావడం లేదు. భూగర్భజలాల నీటి మట్టం మరీ అడుగంటిపోతోంది. ప్రభుత్వాలు వేసవికి ముందు తీసుకోవాల్సిన చర్యలు తీసుకోకపోవడంతో నీటిఎద్దడి అనేకప్రాంతాల్లో మరింత తీవ్రంగా వుంది. అనేక గ్రామాల్లో మంచినీటి రక్షిత పథకాలున్నా వాటిలో చాలా పథకాలు మరమ్మ తులకు గురైవున్నా వాటి దుస్థితిని ఎవరూ పట్టించు కోకపోవడంతో ఈ వేసవిలో నీళ్ళ బాధలు ప్రజలను మరింతగా బాధిస్తూనే వున్నాయి. వేసవి వస్తే ప్రభుత్వం షరామామూలుగా ప్రకటించే ఇంకుడుగుంటలు, పంట గుంటలు, చెక్‌డ్యామ్‌లు, చలివేంద్రాలు వగైరాలన్నీ వేసవి పథకాలుగా వినడానికి వేడివేడిగా వుంటాయే తప్ప, ఆచరణలో అన్నీ నత్తనడకే. ఒక పద్ధతి ప్రకారం వేసవి రాకముందు నుంచీ తగు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఆ పథకాలన్నీ ఊరించే నీటిమేఘాలుగానే తేలిపోతున్నాయి. గతంలో మంచినీటి చలివేంద్రాలు, మజ్జిగ చలివేంద్రాలు పట్టణాల్లోను, గ్రామాల్లోనూ ఎక్కడ చూసినా లోటు లేకుండా వుండేవి. ఇప్పుడా కాలం పోయింది. దాహమైనప్పుడు బాటసారులకు, కష్టజీవులకు గుక్కెడు చల్లని నీళ్ళిచ్చే చలివేంద్రాలకు కూడా కరువొచ్చిందా అనిపిస్తోంది. ఎండలేమో అదేపనిగా నిప్పులు చిమ్ముతూనే వున్నాయి. పగలంతా భగభగలు..సాయంత్రమైతే ఊపిరాడనంత భుగభుగలు. ఆ సెగలపొగలకు తట్టుకోలేక అటు ఇళ్ళలో వుండలేక, ఇటు బయటకూ రాలేక జనం పడే బాధలు ఆ దేవుడికే ఎరుక. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా వేడిగాలులు వీస్తుండడంతో జనం రోడ్లమీదకి రావడానికే భయపడుతున్నారు. గతంలో 35 డిగ్రీల వేడిమికే అల్లాడిపోయిన జనం, ఇప్పుడు ఏకంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రతల ధాటికి విలవిలలాడాల్సి వస్తోంది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల పరిస్థితి ఈ వేసవిలో మరింత దయనీయంగా వుంటోంది. పైపెచ్చు ఈ వేడిగాలుల ధాటికి వడదెబ్బ మరొకటి. ఎప్పుడు ప్రాణం తీసుకుపోతుందో తెలియదు. రోడ్డు పక్క కాసేపు నిల్చుందామన్నా చెట్టు నీడ కనిపించని దుస్థితి. మనుషుల పరిస్థితే ఇంత ఘోరంగా వుంటే, ఇక పక్షులు, ప్రాణులు, మూగ జీవాల పరిస్థితి మరెంత దయనీయంగా వుందో వూహించుకోవచ్చు. అయినా, ఇంత మిడిమేలపు ఎండలు గతంలో ఎప్పుడూ వుండేవి కావు. చెట్లతో అన్ని ప్రాంతాలు అప్పట్లో కళకళగా వుండేవి. ఇప్పుడేమో నానాటికీ పెరిగిపోతున్న జనాభా, పెరుగుతున్న జనాభాకు అనువుగా నీటి వనరులు లేకపోవడం, మారుతున్న జీవనప్రమాణాలు, మరోవైపు పారిశ్రామికీకరణ, పర్యావరణం పట్ల శ్రద్ధ లేకపోవడం వంటి కారణాలెన్నో నీటి కరువుకు దారిచూపుతున్నాయి. వానలొచ్చినప్పుడు ఆ వర్షపునీరు వృధాగా సముద్రంలో కలిసిపోకుండా ఎక్కడికక్కడ చెక్‌డ్యామ్‌లు కట్టుకుని, ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టుకునే విధంగా ఏర్పాట్లు చేసుకునే ప్రక్రియ మన రాష్ట్రంలో అక్కడక్కడా వున్నా, అదింకా పూర్తిస్థాయిలో విస్తరణకు నోచుకోలేదు. నీటి శుద్ధికి, నీటి వనరుల పరిరక్షణకు అధునాతనమైన విధానాలు ఇంకా అమలులోకి రావడం లేదు. పంటలకు అవసరమైన విధంగా పంట కుంటలు, గృహావసరాలకు అవసరమైన భూగర్భ జలాలు ఇగిరిపోకుండా ఇంకుడు గుంటలు నిర్మించుకోవడం, మొక్కలు విస్తృతంగా నాటి పర్యావరణ పరిరక్షణకు ఉద్యమించడం వంటివి ఇంకా నినాద ప్రాయాలుగానో, నామమాత్రంగానో వుంటున్నాయే తప్ప పూర్తిస్థాయిలో ఆచరణకు వచ్చిం దెప్పుడు?.. సేద్యంలో నీటిని పొదుపుగా వాడుకునే బిందుసేద్యం ప్రక్రియ అసలే కనిపించడం లేదు. ఇజ్రాయిల్ వంటి దేశాల్లో వలె, కలుషిత నీటిని శుద్ధి చేసుకుని సేద్యానికి వినియోగించుకునే ఆధునిక ప్రక్రియలు మనకింకా ఆచరణలోకి రావడం లేదు. ప్రత్యేకించి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నీరు-చెట్టు కార్యక్రమం కూడా అశ్రద్ధ పాలై నామమాత్రావశిష్టం గానే వుందే తప్ప ఆచరణలో ఆశించిన ఫలితాల నివ్వడం లేదు. మరోవైపు విచక్షణా రహితంగా చెట్లను నరికేయడం, పంట పొలాలు, పచ్చని స్థలాల్లో మేడలు మిద్దెలు కట్టుకోవడం..పట్టణ ప్రాంతాల్లోనైతే అసలు మట్టే కనిపించకుండా అంతా కాంక్రీట్‌మయం కావడం, పంటకాలువలు దురాక్రమణలకు గురై వాటి స్థానంలో భవనాలు వెలవడం..ఇలాంటి అనర్థాలన్నీ కలసి వెరసి పర్యావరణానికి చేటు తెస్తున్నాయి. ఇప్పుడే కాదు..ఎప్పటికైనా సరే పర్యావరణ పరిరక్షణే మనకు శ్రీరామరక్ష. ఇలాంటి బాధలన్నిటినుంచి విముక్తి కలిగించేది అదొక్కటే. చెట్లే మానవజీవన ప్రగతికి మెట్లు అన్నది గుర్తుంచుకుని మొక్కలను, చెట్లను, వనాలను, అడవులను పరిరక్షించుకుంటే చాలు..ఆ చెట్లే మనకు బాసటగా నిలుస్తాయి. నిలవడానికింత నీడనిస్తాయి. ధర్మో రక్షతి రక్షితః అన్నట్లుగా పర్యావరణాన్ని మనం రక్షించుకుంటే..ఆ పర్యావరణమే మనల్ని రక్షిస్తుంది. భగభగ మండే ఈ వేసవి తాపాన్నుంచి, ఈతిబాధలు..నీటిబాధల్నుంచి మనల్నే కాదు..అన్ని ప్రాణుల్నీ చల్లగా కాపాడుతుంది.

### దాహమైనప్పుడే.. బావి

మండువేసవి భగ్గుమంటోంది. రాష్ట్రంలో నీటి కరువు విజృంభిస్తోంది. అటు సాగునీటికీ, ఇటు తాగునీటికీ జనం పడే అవస్థలు వర్ణనాతీతంగా వుంటున్నాయి. గ్రామాల్లో పరిస్థితి మరింత దయనీయంగా వుంటోంది. చెరువులు దొరువులు నీటి వనరులన్నీ ఎండిపోయాయి. భూగర్భజలాల నీటిమట్టం అడుగంటిపోతోంది. నీరు-చెట్టు వంటి కార్యక్రమాలు నత్త నడకలోనే వున్నాయి. పర్యావరణ పరిరక్షణపట్ల శ్రద్ధ లేకపోవడంతో వేసవి తాపం భరించలేనిదిగా వుంటోంది.



## నిజాయితీ అంటే ఇదే



ఆటోడ్రైవర్ కాయల రఘును అభినందిస్తున్న ఎస్పీ విశాల్ గున్నీ


రోడ్డు మీద రెండు రూపాయలు దొరికితే నరమానవుడికి తెలియకుండా టక్కున నొక్కేసే ఈరోజుల్లో దాదాపు రూ. 10లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు, డబ్బు, తన ఆటోలో దొరికితే నిజాయితీగా ఆ మొత్తం ఉన్న బ్యాగును పోలీసులకు అప్పగించి తన నిజాయితీని చాటుకున్నాడు ఆటోడ్రైవర్ కాయల రఘు. వివరాల్లోకి వెళితే నెల్లూరు చింతారెడ్డిపాలెం యన మలవారిదిన్నెకు చెందిన ఆటోడ్రైవర్ కాయల రఘు విఆర్‌సి సెంటర్లో ఆటో స్టాండ్‌లో వుంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గూడూరు ఇందిరానగర్‌కు చెందిన గున పాటి మురహరిరెడ్డి తన పని మనిషితో కలిసి ట్రావెల్స్‌లో హైదరాబాద్ నుంచి నెల్లూరు వచ్చి శుక్రవారం ఉదయం మినీ బైపాస్‌రోడ్డు వద్ద ఆటో ఎక్కి చిల్డ్రన్స్‌పార్క్ వద్ద పుండరీ కాక్షయ్య వీధిలో వున్న స్నేహితుడి ఇంటి వద్ద దిగాడు. ఆటోలో వున్న నాలుగు బ్యాగులను తీసుకుని మరొక నగల బ్యాగు పని మనిషి తీసుకువస్తుందని లోనికి వెళ్లాడు. పనిమనిషి ఇంట్లోకి ఖాళీ చేతులతో రావడం గుర్తించిన మురహరి రెడ్డి నగల బ్యాగు లేకపోవడంతో నివ్వెర పోయి ఆటో కోసం గాలించి బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ బ్యాగులో రూ. 10లక్షలు విలువజేసే బంగారు ఆభర ణాలు, డైమండ్ రింగులు, లాప్‌టాప్, సెల్‌ఫోన్ రూ. 40వేల నగదు ఉందని ఫిర్యాదు చేశారు. ప్రయాణీకులను దించి కొద్ది దూరం వెళ్లిన ఆటో డ్రైవర్ రఘు వెనుక బ్యాగు ఉండడం గమనించి బాధితులకు ఇచ్చేందుకు వెనక్కి వచ్చాడు. గమనించిన బాధితుడు, పోలీసులు ఆటో వద్దకు రాగా వారికి బ్యాగు అప్పగించాడు. పోలీసుల సమక్షంలో బాధితుడు బ్యాగును తెరచి అందులో అన్ని వస్తువులు ఉండటంతో ఆటో డ్రైవర్‌ను అభినందించారు. నగర డిఎస్పీ వెంకటరాముడు ద్వారా విషయం తెలుసుకున్న ఎస్పీ విశాల్‌గున్ని నిజాయితీపరుడైన ఆటోడ్రైవర్‌ను తన ఛాంబర్‌లో అభినందించాడు. రఘును సహచర ఆటోడ్రైవర్లు ఆదర్శంగా తీసుకోవాలని సూచించాడు. బాధితుడు మురహరిరెడ్డి ఆటోడ్రైవర్‌కు ఎస్పీ ద్వారా రూ. 5వేలు నగదును బహుకరించాడు.

## ఆర్టీసీ ఏసి ఛార్జీలలో మార్పులు

నెల్లూరు ఆర్టీసీలో 19వ తేదీ నుండి ఫ్లెక్సీ ఛార్జీలను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. నెల్లూరు నుండి హైదరాబాద్‌కు నడిచే అమరావతి, గరుడా బస్సుల్లో ఈ ఫ్లెక్సీ ఛార్జీలను అమలు చేస్తున్నారు. ప్రయాణీకుల రద్దీ తక్కువుగా వుండే మంగళ, బుధ, శుక్రవారాలలో 10 నుండి 20శాతం ఛార్జీలను తగ్గించారు. అమరావతి బస్సులో 938రూపాయల టిక్కెట్ 750రూపాయలు, గరుడ బస్సులో 878రూపాయల టిక్కెట్ 715రూపాయలవుతుంది. ఆదివారం మాత్రం 10శాతం అదనపుఛార్జీ వసూలు చేస్తారు.

## ఎర్రచందనం స్మగ్లింగ్‌పై నిఘా

ఎర్రచందనం స్మగ్లింగ్‌పై నిఘా పెంచుతామని, స్మగ్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని నెల్లూరుజిల్లా అటవీశాఖాధికారి డాక్టర్ పివిఎస్ రాఘవయ్య పేర్కొన్నారు. అనంతపురం డిఎఫ్ఓగా పనిచేస్తూ బదిలీపై నెల్లూరు వచ్చారు. సోమవారం అటవీశాఖ (టెరిటోరియల్) డిఎఫ్ఓగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖలో పని చేసే వారెవరైనా ఆరోపణలు వస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. విచ్చలవిడిగా చెట్లను నరికితే పర్యావరణానికి చేటుకలుగుతుందని, అనేక ఇబ్బందులు పడుతామన్నారు. జిల్లాలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌ను నిరోధించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తామన్నారు.




### ఎయిర్ కర్టెన్‌లు ఏర్పాటు చేయండి

ఎంతో చారిత్రక ప్రాధాన్యం వున్న నెల్లూరు పురమందిరంలో ఏ.సిలు ఏర్పాటు చేసారు. బాగానే వుంది. అయితే అవి సరిగా ఉపయోగపడడం లేదు. పురమందిరంకు అటు వైపు ఇటు వైపు తలుపులు ఎక్కువుగా ఉన్నాయి. కార్యక్రమాలు జరిగే సమయంలో వాటన్నింటిని తెరచి ఉంచుతున్నందువల్ల ఏ.సి నిలవడం లేదు. అలాగని తలుపులన్నీ మూస్తే ఏ.సి చాలక ఉక్కపోతకు గురవుతున్నారు. దీని బదులు ప్రతిడోర్ వద్ద ఎయిర్ కర్టెన్‌లు ఏర్పాటు చేస్తే ఏ.సి పెట్టిన ప్రయోజనం నెరవేరుతుంది.

**ఎన్.బి.ఆర్.నాయుడు, నెల్లూరు.**

### ఈ సినిమా గబ్బుసింగ్

'సర్దార్ గబ్బర్‌సింగ్' సినిమా ప్రేక్షకులకు పిచ్చెక్కించేలా వుంది. కాల్పుల మోత తప్పితే సినిమాలో ఇంకేమీ లేదు. పవన్ కళ్యాణ్ వెకిలి చేష్టలు ఒక సినిమాలో చూడగలరు, అన్ని సినిమాలు అలాగే తీస్తే ఎలా? పోలీసులను మరీ అతిగా చూపించారు. ఇలాంటి సినిమాలు తీసి పోలీసు ప్రతిష్టను దెబ్బతీయొద్దు.

**బి.వి.సాగర్, నెల్లూరు.**

### క్లీన్ అండ్ గ్రీన్‌పై శ్రద్ధ పెట్టండి

ప్రజల చేత ఓట్లేయించుకుని గెలిచిన కార్పొరేటర్లు వారి డివిజన్‌లలో క్లీన్ అండ్ గ్రీన్‌పై శ్రద్ధ పెడితే పరిసరాలు బాగుపడతాయి. దోమలు కొంతవరకు తగ్గుతాయి. మున్సిపల్ కొళాయిల నుండి నీళ్ళు వృధాపోకుండా చూడాల్సిన బాధ్యత మన అందరిపై వుంది.

**- టి.రమణయ్య, నెల్లూరు.**

### ప్రకటన బోర్డులు తొలగించారు

నెల్లూరు టౌన్‌లో డివైడర్ల మధ్యనున్న ప్రకటనల బోర్డులను తొలగించిన కమిషనర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. ఈ బోర్డుల వల్ల చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. నగరంలో రోడ్లకు అడ్డంగా వున్న అన్ని ప్రకటనల బోర్డులను కూడా తొలగించాలి.

**- వి.కార్తీక్, బి.టెక్, నెల్లూరు.**

# ప్రతిభా 'పద్మా'లకు టిఎస్ఆర్ సత్కారం







దేశంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్నవారిని సత్కరించుకోవడం ద్వారా ఆయా రంగాలపై తమకున్న అభిమానాన్ని చాటుకుంటూ, తద్వారా వారికి మరింత ప్రోత్సాహాన్ని అందించే సత్సంప్రదాయానికి కళాబంధు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, రాజ్యసభ సభ్యుడు టి.సుబ్బరామిరెడ్డి శ్రీకారం చుట్టారు. అటు వైద్యరంగంలోనూ, ఇటు సినీరంగంలోనూ దేశఖ్యాతిని ఇనుమడించే ప్రతిభాపాటవాలతో అత్యుత్తమమైన పద్మవిభూషణ్, పద్మశ్రీ అవార్డులను పొందిన ఇరువురు ప్రముఖులను ఆయా రంగాల్లోని ప్రముఖులందరి సమక్షంలో ఇటీవల ఘనంగా సత్కరించి టిఎస్ఆర్ అందరి ప్రశంసలనందుకున్నారు.

ఈ కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి, తెలంగాణ మంత్రి పోచారం శ్రీనివాసులు రెడ్డి, టియస్ఆర్‌తో పాటు ఆయన సతీమణి ఇందిరమ్మ, కుమార్తె పింకి రెడ్డి, కోడలు సరిత తదితరులు పాల్గొన్నారు.

## పద్మవిభూషణ్ బిరుదాంకితులు డాక్టర్ నాగేశ్వరరెడ్డి :

వైద్యరంగంలో విశిష్టమైన సేవలందిస్తూ, ఎంతో ప్రతిష్టాత్మకమైన పద్మభూషణ్ అవార్డును పొందిన ఏసియన్ గ్యాస్ట్రోఎంట్రాలజీ అధినేత, ప్రముఖ వైద్యుడు నాగేశ్వర్‌రెడ్డిని కళాబంధు, రాజ్యసభ సభ్యుడు డా.టి.సుబ్బరామి రెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ నెల 7న హైదరాబాద్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో ఎంతో వేడుకగా జరిగిన కార్యక్రమంలో గ్యాస్ట్రో ఎంటరాలజీ, థెరపాటిక్ ఎండోస్కోపి వైద్యునిగా విశిష్ట సేవలందిస్తున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు.

## పద్మశ్రీ బిరుదాంకితురాలు ప్రియాంక చోప్ర :

సినీరంగంలో ప్రముఖ తారామణిగా భాసిస్తూ బాలీవుడ్–హాలివుడ్ ఫిల్మ్‌స్టార్‌గా ప్రఖ్యాతినందుకున్న ప్రియాంక చోప్రాను టిఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న ఢిల్లీలోని తాజ్‌మహల్ హోటల్‌లో టి.సుబ్బరామిరెడ్డి ఘనంగా సత్కరించారు. ప్రపంచ ప్రఖ్యాతిచెందిన పారిశ్రామికవేత్తలు, సినీ దిగ్గజాలు, మరెందరో ప్రముఖుల మధ్య ప్రియాంక చోప్రాకు ఈ ఘనమైన సత్కారం జరిగింది. ఎంతో వేడుకగా జరిగిన ఈ కార్యక్రమంలో టిఎస్ఆర్‌తో పాటు ఆయన కుమార్తె పింకి రెడ్డి, ప్రముఖ సినీ హీరో మోహన్‌బాబు, బ్రిటిష్ హై కమిషనర్ సర్ డొమినిక్ ఆస్క్విత్, ప్రముఖ బాలివుడ్ హీరో శత్రుఘ్నుసిన్హా తదితరులు పాల్గొని ప్రియాంక చోప్రాకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ వేడుకలో యుఎస్ రాయబారి రిచర్డ్ వెర్మ, ప్రఖ్యాత ఫాషన్ డిజైనర్ రీతు బెరితో పాటు ప్రముఖులెందరో పాల్గొన్నారు. బాలీవుడ్ నటిగా తన సినీరంగ ప్రస్థానాన్ని ప్రారంభించి హాలీవుడ్‌లో సైతం తన ప్రతిభను కనబరచి అంతర్జాతీయ గుర్తింపు సాధించిన ప్రియాంక చోప్రాకు 'పద్మ' అవార్డు సముచిత గౌరవమని టియస్ఆర్ పేర్కొన్నాడు.







# చిన్న పరిశ్రమల ద్వారానే ఆర్ధికాభివృద్ధి

చిన్న పరిశ్రమల ద్వారానే ఉపాధి అవకాశాలు, ఆర్ధికాభివృద్ధి పెరుగుతుందని కేంద్ర పరిశ్రమల మంత్రి గిరిరాజ్ సింగ్ అన్నారు. ఈ నెల 16న కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన పారిశ్రామిక సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, చిన్న తరహా, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేవారికి కేంద్రం తోడ్పాటునిస్తుందని, నెల్లూరు నగర పరిసరాల్లో బంగారం, వజ్రాల తయారీపై శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పేందుకు కృషి జరుగుతోందని, కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు కోరిక మేరకు ఈ భారీ ప్రాజెక్టును మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఈ సదస్సులో పాల్గొన్న కేంద్రమంత్రి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ, స్వయం ఉపాధి, స్వావలంబన వైపు యువత అడుగులు వేయాలన్నారు. చిన్న పరిశ్రమలు స్థాపించేందుకు యువత ముందుకు రావాలన్నారు. అనంతరం, జిల్లాలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ప్రముఖులను సత్కరించారు. విద్యార్థుల చదువులకు, వైద్యానికి అన్ని విధాలా సాయం అందిస్తున్న ప్రముఖ దాత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని ఘనంగా సన్మానించారు. అదేవిధంగా మేయర్ అబ్దుల్ అజీజ్‌ను, బొల్లినేని సంస్థల తరఫున గిరినాయుడును, సివిఆర్



పారిశ్రామిక సదస్సులో పాల్గొన్న అతిరథులు

ఫౌండేషన్ ద్వారా పేదలకు మౌలిక సదుపాయాలు సమకూరుస్తున్న కృష్ణపట్నం సిఇఓ అనిల్ ఎండ్లూరిని, మురళీకృష్ణ హోటల్స్ అధినేత గ్రోసు గోపాలయ్యను, ఎంజి బ్రదర్స్ అధినేత గంగాధర్‌ను, సిఎం ఓఎస్డీ కొండయ్య, జిల్లా కలెక్టర్ ఎం.జానకిలను ఘనంగా సత్కరించారు.

Apollo SPECIALITY HOSPITALS TOUCHING LIVES
చెన్నై అపోలో హాస్పిటల్స్ నుండి ప్రముఖ
గుండె శస్త్ర చికిత్స నిపుణులు
డా॥ డి.జనార్ధన్ రెడ్డి గారు
MS., DNB (CTVS)
Chief Cardiothoracic and Vascular Surgeon
Apollo Hospitals, Chennai.
మా ప్రత్యేకతలు : ✦ గుండె మార్పిడి ✦ బైపాస్ సర్జరీ ✦ వాల్వ్ (కవాటముల సమస్యలు) ✦ హై బి.పి ✦ షుగర్ ✦ హార్ట్ ఎటాక్ సమస్యలు ✦ అలసట వలన కలుగు హృద్రోగ సమస్యలు ✦ చిన్నపిల్లలలో గుండెలో రంధ్రముల సమస్యలు
తేది: 30-04-2016, శనివారం ఉ॥ 9.00 గం॥ల నుండి సా॥ 5.00 గం॥ల వరకు పేషంట్లను పరీక్షించెదరు
అపాయింట్‌మెంట్స్ కొరకు సంప్రదించండి.
అపోలో స్పెషాలిటి హాస్పిటల్స్
ముత్తుకూరు రోడ్, నెల్లూరు. ✆ : 0861-333 7 333, 235 8 333

JAGAN'S
Invitation
We cordially invite you
on the inauguration of Software Company
promoted by S.V. Jagan Mohan Reddy
Chairman, Jagan's Group of Institutions, Nellore
Chief Guest
Sri Somireddy Chandra Mohan Reddy, M.L.C
will Launch Company and Logo
Guests of Honour
Sri Subhakar Reddy
Chairman, WISSEN Softwares
Sri Venky Kothakota
Senior Director, ORACLE
Sri Sreenivasa Reddy. T
VP-IT, Asia Pacific Region, SCHNEIDER
Industry - Institutional Tie up
Wissen Eliminating Uncertainty
CEO's Interaction with Engineering students.
All the Engineering students and parents are invited to interact with the industry experts.
Date : 24-04-2016 Time : 9-30 a.m.
Venue : Parameswari Kalyana Mandapam, Mini Bye-Pass Road, Nellore.
S.V. Jagan Mohan Reddy
Chairman, Jagan's Group of Institutions

# డాక్టర్ శాంతకు ఘనమైన సత్కారం

## - ప్రతిష్టాత్మక ఎల్లాప్రగడ అవార్డు ప్రదానం




ప్రసంగిస్తున్న డాక్టర్ జగదీష్




డాక్టర్ వి.శాంతకు అవార్డును ప్రదానం చేస్తున్న కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు

విశ్వ విఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు పేరిట నెల్లూరులో ఏర్పాటుచేసిన ప్రతిష్టాత్మక అవార్డును ఈ ఏడాది మద్రాసులోని క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఛైర్మెన్ డాక్టర్ వి.శాంతకు ప్రదానం చేశారు. వెంకటాచలంలోని స్వర్ణభారత్‌లో ఈనెల 16న ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది.

డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు ఫౌండేషన్ ఛైర్మెన్, ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఎ. జగదీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా డాక్టర్ శాంతకు డాక్టర్ ఎల్లాప్రగడ అవార్డును, ప్రశంసాపత్రాన్ని అందజేసి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, వైద్యరంగంలో అనేక పరిశోధనలు చేసి భారతదేశ కీర్తిప్రతిష్టలను ప్రపంచవ్యాప్తంగా చాటిన విఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు పేరుతో అవార్డును ఏర్పాటు చేయడం, అలాంటి విశిష్టమైన అవార్డును వైద్యరంగంలో విశిష్టసేవలందిస్తున్న డాక్టర్ శాంత వంటివారికి అందజేయడం ఎంతో అభినందనీయమని ప్రశంసించారు. అవార్డు గ్రహీత డాక్టర్ శాంత మాట్లాడుతూ, క్యాన్సర్‌వ్యాధిపై మన దేశ శాస్త్రవేత్తలు ముమ్మరమైన పరిశోధనలు జరిపి క్యాన్సర్ వ్యాధి ప్రమాదకరం కాదని నిర్ధారించారన్నారు. వైద్యులు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరమైనంత మేరకు వినియోగించుకోవాలని, అలాకాక అవసరం లేకపోయినా రోగులపై ఆ భారం మోపడం సముచితం కాదని అన్నారు. తొలుత, ఫౌండేషన్ ఛైర్మెన్ డాక్టర్ ఎ.జగదీష్ ఈ కార్యక్రమానికి స్వాగతం పలుకుతూ, విఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు సేవలను వివరించారు. మందుల మాంత్రికుడుగా ప్రసిద్ధిగాంచిన డాక్టర్ ఎల్లాప్రగడ ప్రపంచంలో ఏ శాస్త్రవేత్త కనుగొనని విధంగా విశిష్టమైన మందులెన్నో కనుగొన్నారని, తద్వారా రోగులకు ఆయన చేసిన సేవలు అమూల్యమని అన్నారు. నోబెల్ బహుమతికి మించిన పరిశోధనలు చేసినప్పటికీ, డాక్టర్ ఎల్లాప్రగడ పేరు నోబెల్ బహుమతి పరిశీలనకు వచ్చిన దాఖలాలు లేవని, అయినా డాక్టర్ సుబ్బారావు ఏనాడూ కీర్తికోసం పరితపించలేదని ఆయన అన్నారు. అయితే, స్టాక్‌హోమ్‌లోని వైద్యరంగానికి చెందిన నోబెల్ కమిటీ కార్యాలయంలో డాక్టర్ ఎల్లాప్రగడ చిత్తరువును ఏర్పాటుచేయడం ఎల్లాప్రగడ వైద్యరంగంలో చేసిన కృషికి, ప్రతిభకు ఒక తార్కాణమని అన్నారు. "డాక్టర్ సుబ్బారావు జన్మించారు కాబట్టే మనమంతా బాగున్నాం..అంతేకాకుండా ఎక్కువ కాలం జీవిస్తున్నాం"..అని ప్రముఖ అమెరికన్ రచయిత డోరాన్ కె.ఆన్‌ట్రిమ్ పేర్కొన్నారని, "కొంతమంది మరణించి జీవిస్తారని, ఆ కోవకు చెందిన డాక్టర్ ఎల్లాప్రగడ యుగపురుషుడని'..అభివర్ణించారని ఆయన వివరించారు. అంతటి మేధావికి తగిన గుర్తింపునివ్వడం సముచితమని, మంగళగిరిలో నెలకొల్పబడే ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు డాక్టర్ ఎల్లాప్రగడ పేరు పెట్టడం సమంజసమన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్, ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, జెఎస్ రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కంభంపాటి హరిబాబు, ఎమ్మెల్సీలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్ తదితర ప్రముఖులు, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

# పర్యాటక కేంద్రాల అభివృద్ధికి చర్యలు

## - జిల్లా కలెక్టర్ యం.జానకి



నెల్లూరుజిల్లాలో గుర్తించిన పర్యాటక కేంద్రాలను అభివృద్ధి పరచేందుకు నిర్దేశించిన కార్యక్రమాల పనులను పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ యం.జానకి పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ బంగ్లాలో సంబంధిత అధికారులతో పర్యాటక అభివృద్ధికి సంబంధించిన పనులపై కలెక్టర్ సమీక్షించారు. పల్లిపాడు గాంధీజీ ఆశ్రమం పరిధిలో మ్యూజియం ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మైపాడులో కాన్ఫరెన్స్‌హాలు, జువ్వలదిన్నె ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కొడవలూరు మండలం వెంకన్నపురం శిక్షణ కేంద్రం, భీముడివారిపాళెం, వేనాడు, నేలపట్టు, రామతీర్థం, కొత్తకోడూరు ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో టూరిజం కార్పొరేషన్ ఇడి చంద్రమౌళి, నెల్లూరు ఆర్‌డిఓ వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఎస్‌ఇ సుబ్బారావు, జిల్లా టూరిజం అధికారి నాగభూషణం, నెల్లూరు తహశీల్దార్ వెంకటేశ్వర్లు, కన్సల్టెంట్స్ అపూర్వ, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు




# బ్లాక్ టిక్కెట్లకు చెక్‌పెడదాం...

## - ఎస్2 ఇన్‌ఛార్జ్ ఆదిత్యరెడ్డి



బ్లాక్ టిక్కెట్లను అరికట్టడంలో ప్రజలు సహకరించాలని, ప్రజాచైతన్యంతోనే బ్లాక్ టిక్కెట్ల వ్యవస్థను అరికట్టగలమని నెల్లూరు ఎస్2 థియేటర్‌ల ఇన్‌ఛార్జ్ యం.ఆదిత్యరెడ్డి పేర్కొన్నాడు. మంగళవారం నెల్లూరు ఎస్2 థియేటర్ సమావేశమందిరంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న అల్లు అర్జున్ నటించిన 'సరైనోడు' సినిమా విడుదలవుతుందని, బ్లాక్ టిక్కెట్లను అరికట్టడమే ఎస్2 థియేటర్‌ల ముందున్న సవాల్ అని అన్నారు. ప్రేక్షకులు, ప్రజలు మద్దతిస్తేనే బ్లాక్‌టిక్కెట్లను అరికట్టవచ్చున్నారు. ఎవ్వరూ బ్లాక్ టిక్కెట్లు కొనవద్దని, ఎవరైనా అమ్ముతుంటే వెంటనే వారిని పట్టుకుని యాజమాన్యానికి అప్పగిస్తే టికెట్ బార్‌కోడ్ ద్వారా బ్లాక్‌టిక్కెట్ల విక్రేతలను గుర్తించి వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఆన్‌లైన్ ద్వారా కొన్న టిక్కెట్‌లను కొందరు ఎస్ఎంఎస్‌ల ద్వారా, మరికొందరు ప్రింట్ ద్వారా తెస్తున్నారని, ఎస్2 గ్రూప్ థియేటర్లలో ప్రింటింగ్ టిక్కెట్లను అనుమతించరన్నారు. కేవలం ఒరిజినల్ ఎస్ఎంఎస్ టిక్కెట్‌లను మాత్రమే అనుమతిస్తామన్నారు. మూడేళ్లు దాటిన పిల్లలకు విధిగా టిక్కెట్‌లను కొనుగోలు చేయాలన్నారు. మల్టీప్లెక్స్ థియేటర్లలో ప్రభుత్వం ఈ పాలసీని విధించిందన్నారు. ఆన్‌లైన్ ద్వారా పారదర్శకంగా కొత్త సినిమాల టిక్కెట్‌లను అందిస్తామన్నారు. అభిమానులకు కూడా టిక్కెట్లు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఒక రోజుకు తమ వద్ద 3వేల టిక్కెట్ల సౌకర్యం ఉంటే ఒక్కరోజే 10వేలమందికిపైగా టిక్కెట్లు ఆశిస్తున్నారని, టిక్కెట్లు లేవంటే బ్లాక్‌లో అమ్ముకుంటున్నారంటూ తమపై అభాండాలు వేస్తున్నారన్నారు. సమావేశంలో ఎస్2 థియేటర్ల మేనేజర్లు లీలాప్రసాద్, సాయిరామ్, విజయకుమార్ పాల్గొన్నారు.

# ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టండి

## - పాత్రికేయులకు జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ సూచన



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న జేసీ ఇంతియాజ్ అహ్మద్

పాత్రికేయులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకుంటుండాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేసుకుంటూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ అన్నారు. నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు, అమీరుద్దీన్ ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో, అపోలో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి వారి సౌజన్యంతో జర్నలిస్టులు, వారి కుటుంబసభ్యుల ఆరోగ్యపరీక్షల కోసం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఈ వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేసిన వారందరినీ ఆయన ఈ సందర్భంగా అభినందించారు. హ్యూమన్‌రైట్స్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ సమీ, ఏపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, ప్రెస్‌క్లబ్ ఇన్‌ఛార్జి రాజన్, ది జర్నలిస్ట్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు జయరాజ్, అమీరుద్దీన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ రఫీ, అపోలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు కరణం గౌరీనాథ్, సాయిమహేష్, సుధ, జాహ్నవి, సురేఖ, ఆసుపత్రి యూనిట్ హెడ్ నవీన్, డాక్టర్ శ్వేతారెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## కాలధర్మం

# బీద జయమ్మ



తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర మాతృమూర్తి శ్రీమతి బీద జయమ్మ ఈ నెల 19వ తేదీన కనుమూసారు. గత కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. వారిలో బీద రవిచంద్ర మూడవ సంతానం. 20వ తేదీ స్వగ్రామమైన అల్లూరు మండలం ఇస్కపల్లి గ్రామంలో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.



విలేకర్ల సమావేశంలో ప్రసంగిస్తున్న రత్నం విద్యాసంస్థల వ్యవస్థాపకులు కె.వి.రత్నం

## ఇంటర్‌లో...
# రత్నం ఆణిముత్యాలు

రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన జూనియర్ ఇంటర్మీడియట్ ఫలితాల్లో రత్నం జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో స్టేట్ ఫస్ట్ ర్యాంకులు సాధించారని రత్నం విద్యా సంస్థల ఛైర్మెన్ కె.వి.రత్నం తెలిపారు. నెల్లూరు పొదలకూరు రోడ్డులోని రత్నం కళాశాలలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ జూనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో మాదబత్తుల లక్ష్మీప్రసన్న 440 మార్కులకు గాను 437 మార్కులతో స్టేట్ ఫస్ట్ సాధించిందన్నారు. ఇలా 30మందికి పైగా విద్యార్థులు 436 మార్కులు సాధించారని తెలిపారు. అదేవిధంగా యంపిసి విభాగంలో సాధనాల గణేష్ 470 మార్కులకు గాను 466మార్కులు సాధించి స్టేట్‌ఫస్ట్‌గా నిలిచాడని, ఇలా 26మందికి పైగా విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారన్నారు. రాష్ట్ర స్థాయిలో రత్నం విద్యా సంస్థలు ఇంతటి ఘనమైన ఫలితాలు సాధించినందుకు తమ ఫ్యాకల్టీ, ప్రణాళికలే కారణమన్నారు. గతంలో ఎన్నో వేలమంది విద్యార్థుల ఘనమైన విద్యా విజయానికి మార్గదర్శకమైన రత్నం జూనియర్ కళాశాలలు ఇదే స్ఫూర్తితో కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విద్యతో జ్ఞానం - వైద్యంతో ఆరోగ్యం

విపిఆర్ ఉచిత సేవలు • విపిఆర్ విద్య • విపిఆర్ వైద్యం

## VPR విపిఆర్ ఫౌండేషన్ సేవలను ప్రకటించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



సమాజసేవా రంగంలో వేలాదిమంది పేదలకు అండగా నిలిచి మానవతా దృక్పథంతో అపారమైన సేవలందించానని, ఇప్పటివరకు వివిధ కార్యక్రమాలకు నిధులు అందజేశానని, ఇకనుంచి సొంత నిధులతో సమాజానికి ప్రాణప్రదమైన విద్య – వైద్యానికి సంబంధించిన సేవలను అందించాలనే లక్ష్యంతో విపిఆర్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసినట్లు ఫౌండేషన్ అధినేత, ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని తన నివాసంలో 16వతేదీ విలేకర్లతో ఆయన మాట్లాడుతూ నెల్లూరు రూరల్ కనుపర్తిపాడు సమీపంలోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ వద్ద విపిఆర్ విద్య, విపిఆర్ వైద్యాన్ని ఉచితంగా అందించనున్నామన్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉన్నత పాఠశాలను నెలకొల్పామని, ఈ ఏడాది స్టేట్ సిలబస్‌తో 6 నుంచి 8వ తరగతి వరకు ఏర్పాటు చేసి ఒక్కో సెక్షన్‌లో 30మందిని ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. త్వరలో ఈ పాఠశాలను రాష్ట్ర ముఖ్యమంత్రిచే ఆవిష్కరించే ఆలోచన ఉందని వెల్లడించారు. తదుపరి 9, 10తరగతులను నిర్వహిస్తామన్నారు. విపిఆర్ వైద్యం పేరుతో ఇప్పటికే వైద్య సేవలందిస్తున్నట్లు వివరించారు. రాబోయే రోజుల్లో అత్యవసర సేవలందించేందుకు రెండు బెడ్లు, అంబులెన్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అంతేకాకుండా యువతకు ఉద్యోగావకాశాల కోసం అవసరమైన కోర్సులను గుర్తించి వారికి ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామన్నారు. స్వర్ణభారత్ ట్రస్ట్‌తో సంయుక్తంగా డ్రైవింగ్ స్కూల్‌ను ఏర్పాటు చేసే ఆలోచన ఉందన్నారు. తొలుత విపిఆర్ ఫౌండేషన్ బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు.

Apollo SPECIALITY HOSPITALS
TOUCHING LIVES

# నొప్పి తెలియని ల్యాపరోస్కోపిక్ సర్జరీ



Dr Ramesh Maturi, MS FRCS (UK)
Soudavar Fellow MSKCC, USA
Diploma Laparoscopic Surgery (France)
LAPAROSCOPIC CANCER SURGEON
APOLLO SPECIALITY HOSPITALS
Nellore

**1. ల్యాపరోస్కోపి అంటే ఏమిటి?**



సాధారణంగా శస్త్ర చికిత్స కోసం పొట్టలో 10–12 అంగుళాల కోత వేసి, చేతులతో నేరుగా చేయడం జరుగుతుంది. కాని ల్యాపరోస్కోపిలో చిన్న చిన్న గొట్టాల ద్వారా సన్నని, పొడవైన పరికరాలను పొట్టలోకి పంపి శస్త్ర చికిత్స చేయడం జరుగుతుంది. దీని కోసం కీహోల్ అనబడే కేవలం 2 సెం.మీ.ల రంధ్రం మాత్రమే చేయడం జరుగుతుంది. దీనిని బ్యాండ్‌ఎయిడ్ సర్జరీ అని కూడా అంటారు.

**2. సన్నని రంధ్రాల ద్వారా శస్త్ర చికిత్స చేయడం ఎలా వీలవుతుంది?**

రోగి శరీరంలో చేసిన రంధ్రాల నుండి మంచి నాణ్యత గల కెమెరాలను లోపలకి పంపి శరీరం లోపలి పరిస్థితిని శస్త్ర చికిత్స నిపుణులు టి.వి.లో చూస్తూ, సన్నని, పొడవైన పరికరాలను ఉపయోగించి శస్త్రచికిత్స చేస్తారు.

**3. ల్యాపరోస్కోపి అనేది నూతన శస్త్ర చికిత్స విధానమా?**

సంప్రదాయ చికిత్సను కొత్త పద్ధతిలో శస్త్ర చికిత్స చేయడం జరుగుతుంది. ల్యాపరోస్కోపి చికిత్సలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తారు.

**4. ల్యాపరోస్కోపిక్ సర్జరీలో నొప్పి ఎందుకు తెలియదు?**

సాధారణంగా శస్త్ర చికిత్స అంటే శరీరంపై గాటు పెట్టడం ద్వారా చేస్తుంటారు. అవి కండరాలకు నొప్పిని కలిగిస్తాయి. కాని ల్యాపరోస్కోపిలో ఈ కోత చాలా చిన్నదిగా వుండి, కండరాలకు నొప్పి కలిగించకుండాను, శరీరంలోని ఇతర అవయవాలకు హాని కలగకుండాను చేయడం జరుగుతుంది. అందువలన నొప్పి కొద్దిగా మాత్రమే వుంటుంది.

**5. ల్యాపరోస్కోపి వల్ల ఇంకేమైనా ప్రయోజనాలున్నాయా?**

ఈ పద్ధతిలో శస్త్ర చికిత్స చేసిన తర్వాత రోగి త్వరగా కోలుకుంటాడు. నొప్పి కొద్దిగా మాత్రమే వుండడం వల్ల రోగిని పడక మీద నుండి త్వరగా లేచి తిరగగలుగుతారు. కడుపులోని ప్రేగులను నేరుగా చేతులతో తాకనందువల్ల 24 నుండి 48 గంటలలోపే రోగి ఆహారం తీసుకోవడంలో ఎటువంటి ఇబ్బంది వుండదు. సాధారణ శస్త్ర చికిత్సలో ఆహారం తీసుకోవడంలో ఇబ్బంది 5–7 రోజుల వరకు వుంటుంది.

**6. ల్యాపరోస్కోపి శస్త్ర చికిత్స సౌందర్య పరంగా ఎందువల్ల మెరుగైనది?**



కోత చిన్నదిగా వేసే కారణం వల్ల, మచ్చలు ఎక్కువగా కనబడవు. వైద్య నిపుణులు కోత వేసే సమయంలో మచ్చ కనపడకుండా వుండే విధంగా చూసుకుంటారు. అంతేగాక ఆస్పత్రిలో ఎక్కువకాలం మందులతో గడపవలసిన అవసరం వుండదు. రక్తం కూడా ఎక్కువగా కారిపోదు. ల్యాపరోస్కోపిక్ సర్జరీలో ఈ సౌకర్యాలన్నీ వున్నాయి. ముఖ్యంగా క్యాన్సరు శస్త్ర చికిత్స నుండి త్వరగా కోలుకోవటం వలన రేడియోథెరపీ, కీమోథెరపీ త్వరగా తీసుకునే అవకాశం ఉంటుంది.

**7. ల్యాపరోస్కోపి అనేది శస్త్ర చికిత్స విధానంలో సురక్షితమైనదా?**

శస్త్ర చికిత్స సాంకేతిక విధానంలో ల్యాపరోస్కోపి పద్ధతి రెండు దశాబ్దాలుగా ఎంతో ఉపయోగకరంగా వుంది. ప్రారంభంలో ఈ పద్ధతి గైనకాలజీలో మాత్రమే ఉపయోగించబడి, తదనంతరం సాధారణ శస్త్రచికిత్సలకు కూడా ఇదే పద్ధతి ఉపయోగించబడుతోంది. సాంకేతికతతో మెరుగుదలతో బాటు రక్తస్రావ నివారణ పరికరాలు కూడా తయారు చేయడం వల్ల ల్యాపరోస్కోపి శస్త్రచికిత్స క్యాన్సర్ వ్యాధిలో కూడా బాగా ప్రచారంలోకి వచ్చింది.

**8. ల్యాపరోస్కోపి ద్వారా ఎటువంటి వ్యాధులను నయం చేయవచ్చు?**

గర్భాశయ క్యాన్సర్‌లు, పొట్ట మరియు పెద్దప్రేగు క్యాన్సర్లు నయం చేయడంలో ఈ శస్త్ర చికిత్స ఎంతో పేరు పొందింది. అన్నవాహిక క్యాన్సరుకు కూడా ఎంతో ఉపయోగపడుతుంది. ల్యాపరోస్కోపి పద్ధతుల్లో ఎంతో అనుభవం వున్న వైద్య నిపుణులు మాత్రమే ఈ శస్త్ర చికిత్స నిర్వహించవలసి వుంది. కేవలం శస్త్ర చికిత్స నిర్వహించగలగడమే గాక, పరిస్థితులు అనుకూలించనప్పుడు ల్యాపరోస్కోపి పద్ధతి నుండి సంప్రదాయ శస్త్ర చికిత్స పద్ధతికి మార్చుకోగల విజ్ఞత మరియు నిపుణత కూడా కలిగివుండాలి.

**9. సంప్రదాయ చికిత్సకు మారడం అంటే ఏమిటి?**

ఇంతకుముందే చెప్పినట్లు, సంప్రదాయ శస్త్ర చికిత్స బాహ్య పద్ధతిలో జరుగుతుంది. రోగి ఆరోగ్య కారణాల వలన కానీ, జబ్బు తీవ్రత వలన కానీ శస్త్ర చికిత్స ల్యాపరోస్కోపి ద్వారా పూర్తి చేయలేనప్పుడు సంప్రదాయ పద్ధతికి మారడం జరుగుతుంది. ఇది ఆపరేషన్ ఫెల్యూర్ కాదు, వ్యాధిని పూర్తిగా నయం చేసే ప్రయత్నంలో రోగికి హాని జరకుండా ఉండడం కొరకు ఇటువంటి మార్పులు చేయడం జరుగుతుంది.

**10. ఈ శస్త్ర చికిత్సలో మీకేవిధమైన అనుభవం వుంది?**

గత రెండు దశాబ్దాల నుంచి నేను క్యాన్సర్ శస్త్ర చికిత్సలో నిపుణుడుగా వున్నాను. కొన్ని పేరు పొందిన క్యాన్సర్ ఆసుపత్రులలో కూడా పని చేసి వున్నాను. యు.ఎస్.ఏ మరియు యు.కె.లో పనిచేసిన తర్వాత ప్రస్తుతం హైదరాబాదులో ఉస్మానియా మెడికల్ కాలేజీలోని యం.ఎన్.జె. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీలో పని చేస్తున్నాను.

### TYPES OF SURGERY

**General & Gynaec surgeries:**

1. Lap hysterectomy
2. Lap fibroid surgery
3. Infertility
4. Hernia surgery
5. Gall bladder surgery
6. Appendecectomy

**Cancer surgeries:**

Laparoscopic uterine cancer surgery
Laparoscopic ovarian cancer
Laparoscopic intestine cancer
Laparoscopic stomach cancer
Laparoscopic esophageal cancer

2009 సం॥ నుండి నేను ల్యాపరోస్కోపిక్ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నాను. ప్రారంభంలో సీనియర్ సర్జన్లకు సహకారం అందిస్తూ వుండి, ఫ్రాన్స్ నుండి ల్యాపరోస్కోపిక్‌లో ఫెలోషిప్ సాధించాను. తర్వాత భారతదేశంలోనూ పూనా, ముంబై, ఢిల్లీ, చెన్నై మరియు కోచిలోని క్యాన్సర్ హాస్పిటల్స్‌ని సందర్శించి అక్కడ వివిధ రకాల క్యాన్సర్‌లకు శస్త్రచికిత్స నిర్వహించే వైద్య నిపుణులను కలుసుకున్నాను.

ఈ నిపుణులు సర్టిఫికేట్ కోర్సులను నిర్వహిస్తున్నారు. జాన్సన్ మరియు కోవిడియిన్ అనే సంస్థలు కూడా ఈ విధమైన సర్టిఫికేట్ కోర్సులు నిర్వహిస్తున్నాయి. వీటన్నిటిలో నేను శిక్షణ పొంది వున్నాను.

**11. ల్యాపరోస్కోపిలో ఎందువల్ల అతి కొద్ది మంది మాత్రమే నిపుణులుగా వున్నారు?**

ఇందుకు అనేక కారణాలున్నాయి. అందులో ముఖ్యమైనది ఇది కొత్త పద్ధతి కావడమే. ఇదే కారణంగా చాలా శిక్షణ సంస్థలు దీనిలో విద్యార్థులకు శిక్షణ అందించలేకున్నాయి. సాధారణ శస్త్ర చికిత్సలా కాకుండా ఈ ల్యాపరోస్కోపి చాలా కష్టమైన విధానం శిక్షణకు సమయం పడుతుంది. శస్త్ర చికిత్స నిపుణులకు ఎంతో ఆసక్తి, నిపుణత, సామర్థ్యం అవసరం. పైన చెప్పినట్లు, ల్యాపరోస్కోపిక్ శస్త్ర చికిత్సలో నిపుణత సాధించడం ఏదో ఒక చోట జరిగే పని కాదు. దీనికి చాలా సంస్థలు సందర్శించి, నిపుణులతో చర్చించి, వారితో కలిసి పనిచేయడం ద్వారానే అనుభవం వస్తుంది.

**12. ల్యాపరోస్కోపిక్ సర్జన్లకు ప్రత్యేక లక్షణాలుండాలని మీ అభిప్రాయమా?**

కఠిన శ్రమ చేయడం ద్వారానే ఈ శస్త్ర చికిత్సలో నిపుణత సాధించేందుకు వీలవుతుంది. శస్త్ర చికిత్సలో నిపుణత అనేది చిత్రలేఖనం, పెయింటింగ్ లాగే ఒక కళ. దీనిలో ఎంతో అనుభవం పొందిన తర్వాత మాత్రమే దీన్ని నిర్వహించే సమర్థత ఏర్పడుతుంది.

ఈ సామర్థ్యాలతో బాటు విజ్ఞత కూడా అవసరం. తద్వారా మాత్రమే శస్త్ర చికిత్స నిపుణుడికి వ్యాధికి తగిన శస్త్ర చికిత్స అందించడం వీలవుతుంది.

ల్యాపరోస్కోపిలో శస్త్ర చికిత్స చేసే నిపుణుడు ఒక విజ్ఞతతో కూడిన కళాకారుడుగా వుంటూ, బృందాన్ని నడిపించగల నాయకత్వపు సామర్థ్యాలు కలిగి వుండాలి.

**13. ల్యాపరోస్కోపి శస్త్ర చికిత్స రోగులందరికి అవసరమా?**

ఇంతకుముందే చర్చించుకున్నట్లు, అన్ని వ్యాధులకు ల్యాపరోస్కోపి శస్త్ర చికిత్స అనుకూల పడకపోవచ్చు. అవసరమైన పక్షంలో ల్యాపరోస్కోపి నుండి సాధారణ శస్త్ర చికిత్సకు మారవలసి వుంటుంది. రోగులందరూ కూడా దీనికి అనుకూలంగా వుండకపోవచ్చు.

తీవ్రమైన ఊపిరితిత్తుల మరియు గుండె సమస్యలున్న రోగులకు, ఇంతకుముందే శస్త్ర చికిత్సలు చేయించుకొన్నవారికి ఈ శస్త్ర చికిత్స చేయలేకపోవచ్చు.

రోగులను పరిశీలించిన తర్వాత, ఒక్కొక్క కేసును క్షుణ్ణంగా అధ్యయనం చేసిన తర్వాత, సర్జన్లు మరియు అనస్థీయిస్టులు కలిసి చర్చించుకొని, ఏ విధమైన శస్త్ర చికిత్స నిర్వహించాలో నిర్ణయిస్తారు.

**14. ల్యాపరోస్కోపిక్ సర్జరీ వల్ల ఎటువంటి ఇబ్బందులున్నాయి?**

సాధారణ సర్జరీ అయినా, ల్యాపరోస్కోపిక్ సర్జరీ అయినా, రక్తస్రావం, శరీరంలోని ఇతర అవయవాలకు హాని, ఇన్ఫెక్షన్ లాంటి ఇబ్బందులుంటాయి. కాని నిపుణులు ల్యాపరోస్కోపి శస్త్ర చికిత్స నిర్వహించినపుడు, ఇవి తక్కువగా ఉంటాయి.

**15. క్యాన్సర్ సర్జరీలో ల్యాపరోస్కోపి వల్ల ఎటువంటి సౌకర్యాలుంటాయి?**

క్యాన్సర్ చికిత్సలో, డయాగ్నసిస్ చేసేందుకు ల్యాపరోస్కోపి ఉపయోగం మనందరికీ తెలిసిందే. క్యాన్సర్ ఏ దశలో వుందో కనుక్కొని, ఎక్కువ కోత లేకుండా శస్త్ర చికిత్స నిర్వహించవచ్చు.

క్యాన్సర్ చికిత్సలో కీమోథెరపీ మరియు రేడియోథెరపీ శస్త్రచికిత్స తర్వాత నిర్వహిస్తారు. శస్త్ర చికిత్స చేసిన చాలా వారాల తర్వాత సర్జరీ ఇబ్బందుల నుండి రోగి కోలుకొన్న తర్వాత ఈ పద్ధతులు ఉపయోగిస్తారు. కాని ల్యాపరోస్కోపి వల్ల రోగి త్వరగా కోలుకుంటారు. కాబట్టి కీమోథెరపీ చికిత్సలు వెంటనే మొదలు పెట్టవచ్చు.

కొన్ని సందర్భాలలో, క్యాన్సరు శస్త్ర చికిత్సలో, వ్యాధి వలన సర్జరీని అర్ధాంతరంగా ఆపవలసి వుంటుంది. సంప్రదాయ శస్త్ర చికిత్సలో, ఈ విషయాన్ని పెద్ద కోత తర్వాతనే తెలిసే అవకాశం ఉంటుంది. కానీ ల్యాపరోస్కోపిలో, పెద్ద కోత లేకుండా సులువుగా ఈ విషయాన్ని గ్రహించవచ్చు.

**16. ల్యాపరోస్కోపి అనేది చాలా తేలికైన శస్త్రచికిత్సగా భావించవచ్చా?**

దీనికి అవుననీ, కాదనీ సమాధానం చెప్పవచ్చు. రోగికి ల్యాపరోస్కోపిక్ పద్ధతి తేలికైనది. కాని సర్జన్‌కు ఇది సమయం మరియు ఓపిక, సామర్థ్యంతో కూడిన కష్టమైన పని. సర్జన్ నేర్చుకోవడంలో గాని, నిర్వహణలో గాని ఎంతో కష్టపడవలసిన అవసరం వుంది. ఖరీదైన పరికరాలను ఉపయోగించే నేర్పు కూడా వుండాలి. హాస్పిటల్‌లో అనువైన పరికరాలు, సౌకర్యాల అందుబాటును బట్టి దీని పరిణామం వుంటుంది.

# నెల్లూరు కబుర్లు

## ఇంటర్‌లో సత్తా చాటిన నెల్లూరు

ఈ నెల 19వ తేదీన విడుదలైన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలలో నెల్లూరుజిల్లా విద్యార్థులు తమ సత్తా చాటారు. మొదటి సంవత్సరం పరీక్షలను 29,017 మంది వ్రాయగా, 20,680 మంది ఉత్తీర్ణులయ్యారు. రెండో సంవత్సరం పరీక్షలను 24,742మంది వ్రాయగా 19,325 మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి సంవత్సరం ఫలితాలలో మూడో స్థానంలోనూ, రెండో సంవత్సరం ఫలితాలలో రెండో స్థానంలోనూ నెల్లూరుజిల్లా నిలవడం విశేషం.

## మార్కుల రత్నాలకు ఎస్పీ అభినందనలు



ఇంటర్మీడియట్ ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించి రాష్ట్రంలోనే టాపర్స్‌గా నిలిచిన రత్నం జూనియర్ కళాశాల విద్యార్థులు ఎస్.గణేష్, ఎం.లక్ష్మీప్రసన్నలను ఎస్పీ విశాల్‌గున్నీ మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు. లక్ష్మీప్రసన్న బైపిసి విభాగంలో 437 మార్కులను, ఎస్.గణేష్ ఎంపిసిలో 466మార్కులను సాధించారు. ఈ కార్యక్రమంలో రత్నం విద్యాసంస్థల అధినేత కె.వి.రత్నం కూడా పాల్గొన్నారు.

## క్యాన్సర్ ఆసుపత్రిని సందర్శించిన డా॥ వి.శాంత



నెల్లూరు పొదలకూరురోడ్డులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిని అడయార్ క్యాన్సర్ అసుపత్రి వ్యవస్థాపక ఛైర్‌పర్సన్ పద్మవిభూషణ్ డా॥ వి.శాంత ఈ నెల 16న సందర్శించారు. క్యాన్సర్ ఆసుపత్రి స్థాపక దాత జె.యస్.రెడ్డి ఆహ్వానం మేరకు ఆమె విచ్చేశారు. రెడ్‌క్రాస్ సొసైటి ఛైర్మెన్ డా॥ ఎ.వి.సుబ్రహ్మణ్యం, ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి డా॥ టి.లక్ష్మి ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఆసుపత్రిలోని వివిధ విభాగాలను ఆమె సందర్శించి అక్కడ అందుతున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ప్రాంగణం పరిశుభ్రంగా, ఆహ్లాదంగా వుందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో క్యాన్సర్ ఆసుపత్రి దాతలు గణేశం కృష్ణారెడ్డి, జె.పి.జైన్, రెడ్‌క్రాస్ మేనేజ్‌మెంట్ కమిటి మెంబర్ గౌస్‌బాషా, రేడియేషన్ అంకాలజిస్ట్ డా॥ గీతా ఉషశ్రీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రాజేశ్వరి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### శుభమస్తు ఫౌండేషన్ వారి

## మజ్జిగ చలివేంద్రం




నెల్లూరులోని శుభమస్తు ఫౌండేషన్ వారు చిన్నబజారులోని న్యూ రాజ్యలక్ష్మి హాల్ వద్ద 18వతేదీ నుండి మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. బట్టలు, నగలు, ఇతర సామాన్ల కొనుగోలుకు గ్రామాలనుండి ప్రజలు పెద్దసంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. ఈ మండుటెండల్లో వారి దాహార్తిని తీర్చేందుకు శుభమస్తు షాపింగ్ మాల్ అధినేతలు బయ్యా శ్రీనివాసరావు(వాసు), బయ్యా రవికుమార్‌లు తమ తండ్రి స్వర్గీయ బయ్యా వెంకటరమణయ్య జ్ఞాపకార్థంగా ఈ మజ్జిగ చలివేంద్రంను ఏర్పాటు చేశారు.

### మరపురాని.. మరువలేని.. మధురమైన...

# జ్ఞాపకాల సంతకం

## లాయర్ పెళ్లిపుస్తకం



శ్రీ బెజవాడ దశరథరామిరెడ్డి - శ్రీమతి అన్నపూర్ణమ్మ



శ్రీ కె.వి.చలమయ్య - శ్రీమతి శకుంతలమ్మ



శ్రీ ఆల్తూరు ఆదినారాయణరెడ్డి - శ్రీమతి సులోచనమ్మ



శ్రీ కె.వి.రత్నం - శ్రీమతి పద్మావతమ్మ



శ్రీ నంబూరు మోహన్‌రావు - శ్రీమతి సులోచనమ్మ



శ్రీ జె.వి.నారాయణమూర్తి - శ్రీమతి భవాని



శ్రీ ఎన్.వి.రమణయ్య - శ్రీమతి అనసూయమ్మ

***ఆ** పాటలు ఆపాతమధురాలు... ఒక దానిని మించిన ఇంకొకటి అద్భుత గీతాలు. ప్రతి పాటకు ఆహూతులు మైమరిచారు. గాయనీగాయకులు పెళ్లి పాటలు పాడుతుంటే, అతిథులు తమ తీపిజ్ఞాపకాల లోకి వెళ్లిపోయారు. ఇక వేదికపై 50ఏళ్ల వైవాహిక జీవితాన్ని అన్యోన్యంగా పూర్తి చేసుకున్న దంపతులను సత్కరిస్తుంటే, వచ్చినవారందరూ వారిలో తమ తల్లిదండ్రులను చూసుకున్నారు. వారిలాగే తమ తల్లిదండ్రులను సత్కరించుకుంటే ఎంతో బాగుంటుందనుకున్నారు. ఓ వైపు పెళ్లి పాటలు, బ్యాక్‌డ్రాప్‌లో తెరపై ఆ పాటకు సంబంధించిన దృశ్య ప్రదర్శన... మరో వైపు నెల్లూరంతా చిరపరిచితులైన పుణ్య దంపతులకు సత్కారాలు... ఈ నెల 15వ తేదీన సాయంత్రం నెల్లూరు పురమందిరం భారతీయ సంస్కృతి, సంప్రదాయం, ఆధ్యాత్మికతను చాటిచెప్పే ఓ మహత్తర వేదికైంది. 'లాయర్' వారపత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన 'శ్రీరామ నవమి సంబరాలు'తో టౌన్‌హాలు పులకించిపోయింది.*

సీతారామ పూజతో ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. శాసనమండలి సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు గ్రామీణ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సేవా తపస్వి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడి ముద్దుల తనయ శ్రీమతి దీపావెంకట్ ఈ సంబరాలకు ఆత్మీయ అతిథులుగా విచ్చేశారు. భారతీయ వివాహ వ్యవస్థలోని సంస్కృతి, సంప్రదాయాల విలువలను చాటుతూ 'లాయర్' రూపొందించిన 'పెళ్లి పుస్తకం'ను అతిథులు తమ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమం ఆద్యంతం పెళ్లిపాటలతో పురమందిరం ఉర్రూతలూగింది.




**ఆనందోత్సాహాల మధ్య లాయర్ శ్రీరామనవమి సంబరాలు**



శ్రీ యం.నాగేశ్వరరావు - శ్రీమతి యం.నారాయణమ్మలను సన్మానిస్తున్న ముఖ్యఅతిథులు

### ఆ పాటలు ఎంతో మధురం:

శ్రీరామ రాజ్యం చిత్రంలోని 'జగదానంద కారక' పాటతో పాటల సవ్వడి మొదలైంది. ఆ తర్వాత 'శ్రీరస్తు – శుభమస్తు', 'కళ్యాణ వైభోగమే', 'సీతారాముల కళ్యాణం చూతము రారండీ', 'శుభలేఖ రాసుకున్న మదిలో ఎపుడో', 'అలనాటి రామ చంద్రుని', 'తనివి తీరలేదు, నా మనసు ఆగలేదు' వంటి గీతాలతో గాయనీగాయకులు 'పాడుతా తీయగా' ఫేమ్స్ శివ, వల్లీ గాయత్రి, రసూల్, శిరీషలు ప్రేక్షకులను కుర్చీలకు కట్టి పడేసారు. ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వల్లీ గాయత్రి పాడిన ఓ పాటకు ముగ్ధుడై ఆమెకు తన జేబులో వున్న మొత్తం నగదును బహుమతిగా అందజేశారు. పాటలు ముగిసే దాకా ఆయన అక్కడ నుండి కదలకపోవడం విశేషం. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి "తనివి తీరలేదే" అనే తనకు ఇష్టమైన పాటను పాడించుకుని పరవ శించిపోయాడు.

### అపురూపం ఆ సత్కారం:

మన భారతీయ వివాహంలోని గొప్పతనం తెలిసేది పెళ్లయిన తొలినాళ్లలో కాదు... భార్యాభర్తలు జీవిత చరమాంకంలో వున్నప్పుడు ఒకరికొకరు తోడు నీడగా నిలబడతారు. ఒకరి కష్టాన్ని ఒకరు పంచుకుంటారు. ఒకరి కన్నీళ్లు మరొకరు తుడుస్తారు. ఈ ఆధునిక సమాజంలో కొడుకులు, కోడళ్లు, మనుమళ్లు, మనుమరాళ్లు ఉద్యోగాలు, వ్యాపారాల రీత్యా దూరభార ప్రాంతాల్లో వుంటే, భార్యాభర్తలే ఒకరికి ఒకరు తోడై నీకు నేనున్నాననే భరోసాతో జీవిత పయనం సాగిస్తుంటారు. అలాంటి జంటలను గుర్తించి సత్కరించుకోవడం 'లాయర్'కు దక్కిన భాగ్యం. తమ వైవాహిక జీవితంలో 50ఏళ్లు పూర్తి చేసుకున్న పుణ్యదంపతులు మాజీ శాసనసభ్యులు జె.కె.రెడ్డి – సులోచనమ్మ, జిల్లాలో పేరొందిన బెజవాడ కుటుంబసభ్యులు బెజవాడ దశరథరామిరెడ్డి – శ్రీమతి అన్నపూర్ణమ్మ, మురళీకృష్ణ హోటల్స్ వ్యవస్థాపకులు గ్రోసు గోపాలయ్య – శ్రీమతి శాంతమ్మ, ఆర్యవైశ్య మహాసభ నాయకులు కె.వి.చలమయ్య – శ్రీమతి శకుంతలమ్మ, ప్రముఖ వైద్యులు డాక్టర్ పి.మధుసూదన్‌శాస్త్రి – శ్రీమతి రాజ్యలక్ష్మి, మంత్రి నారాయణ గురువర్యులు జె.వి. నారాయణమూర్తి – శ్రీమతి భవాని, డిసిసిబి మాజీ ఛైర్మెన్ వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి – శ్రీమతి సుజాతమ్మ, శ్రీశైలం దేవస్థానం ఛైర్మెన్ ఆల్తూరు ఆదినారాయణరెడ్డి – శ్రీమతి సులోచనమ్మ, రత్నం విద్యాసంస్థల వ్యవస్థాపకులు కె.వి.రత్నం – శ్రీమతి పద్మావతమ్మ, నంబూరు ల్యాబొరేటరీస్ అధినేత నంబూరు మోహన్‌రావు – శ్రీమతి సులోచనమ్మ, వాత్సల్య గౌరవాధ్యక్షులు సామంతు గోపాలరెడ్డి – శ్రీమతి మధుసూదనమ్మ, కోరా విద్యాసంస్థల మాజీ డైరెక్టర్ పి.రాజగోపాల్‌రెడ్డి – శ్రీమతి ఇందిరమ్మ, ఎస్‌విఆర్ ఏజన్సీస్ అధినేత ఎన్.వి.రమణయ్య – శ్రీమతి అనసూయమ్మలను 'లాయర్' సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, వారి సతీమణి శ్రీమతి భారతిలు వేదపండితుల ఆశీర్వచనాలతో సత్కరించారు. కాగా ఇదే వేడుకలో నా అనేవారు ఎవరూ లేక వాత్సల్య, విశాలాక్షి వృద్ధాశ్రమాలలో ఆశ్రయం పొందుతూ 50ఏళ్ల వైవాహిక జీవిత పయనాన్ని పూర్తి చేసుకున్న పోతుల కృష్ణమూర్తిశెట్టి – శ్రీమతి రెడ్డమ్మ, యం.నాగేశ్వరరావు – శ్రీమతి యం.నారాయణమ్మ దంపతులను వేదపండితుల ఆశీస్సులతో సత్కరించిన సన్నివేశం ప్రతి ఒక్కరినీ కదిలించింది. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అయితే ఆ వృద్ధులు వేదికనెక్కడంలో చేయి పట్టుకుని నడిపించి వారి సన్మానంలో పాల్గొని తన తల్లిదండ్రులను సత్కరించుకున్నాననే అనుభూతికి లోనయ్యారు. కార్యక్రమాన్ని తొలుత వాత్సల్య చిన్నారుల కోలాటంతో ప్రారంభించగా మధ్యలో పెళ్లిపాటలు అందరినీ అలరించాయి. ముఖ్యఅతిథులకు 'లాయర్' పక్షాన తుంగా శివప్రభాత్‌రెడ్డి జ్ఞాపికలు అందజేశారు.



డా॥ పి.మధుసూదనశాస్త్రి - శ్రీమతి రాజ్యలక్ష్మి



శ్రీ గ్రోసు గోపాలయ్య - శ్రీమతి శాంతమ్మ



శ్రీ జె.కె.రెడ్డి - శ్రీమతి సులోచనమ్మ



శ్రీ సామంతు గోపాల్‌రెడ్డి - శ్రీమతి మధుసూదనమ్మ



శ్రీ వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి - శ్రీమతి సుజాతమ్మ



శ్రీ పి.రాజగోపాలరెడ్డి - శ్రీమతి ఇందిరమ్మ



శ్రీ పోతుల కృష్ణమూర్తిశెట్టి - శ్రీమతి రెడ్డమ్మ

### అతిథుల ఆత్మీయ ప్రసంగం:









'లాయర్' వేడుకలలో అతిథుల ప్రసంగాలు సైతం ఎంతో చక్కగా క్లుప్తంగా వుంటాయి. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తన ప్రసంగంలో 'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డితో తమ తండ్రి స్వర్గీయ సోమిరెడ్డి రాజగోపాలరెడ్డికి వున్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమ నిర్వహణ ఎంతో బాగుందని అభినందించారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఏడాది క్రితమే తన తండ్రి చనిపోయాడని, ఆయనే ఉండుంటే ఈ సభలో సత్కరించి ఒక మంచి కొడుకుననిపించుకునేవాడినన్నారు. ఇక్కడ సత్కారం జరిగిన పుణ్యదంపతులలోనే తన తల్లిదండ్రులను చూసుకున్నానని చెప్పారు. వేదికలపై ఎప్పుడూ పెద్దగా ప్రసంగమివ్వని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇంత మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన 'లాయర్' టీమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. దీపా వెంకట్ తన ప్రసంగంలో 'లాయర్' పెళ్లిపుస్తకం వల్ల తన అమ్మానాన్నల పెళ్లి ఫోటోను సేకరించగలిగానని ఆనందం వ్యక్తం చేశారు. వైవాహిక జీవితం విలువలను, వివాహ వ్యవస్థ యొక్క ప్రాధాన్యతని తెలియజేసే ఇలాంటి వేడుకలు రేపటితరం వారికి మంచి సందేశాన్నిచ్చి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని అంటూ వినూత్న కార్యక్రమం ద్వారా వివాహ విలువలు తెలియజేసే ప్రయత్నం చేసిన 'లాయర్'ని అభినందించారు.







## కృష్ణపట్నం టు ఒమన్



ఒమన్‌కు కంటైనర్ రవాణా సేవల ప్రారంభోత్సవంలో పోర్టు సిఇఓ అనిల్, ఇతర ప్రతినిధులు

ఇటీవలే కృష్ణపట్నం నుండి బంగ్లాదేశ్‌కు నేరుగా నౌక రవాణాను ప్రారంభించిన కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ మరో ముందడుగు వేసింది. 17వతేదీ నుండి ఒమన్ దేశంలోని సలాలా పోర్టుకు కూడా ఇక్కడ నుండి నౌక ద్వారా కంటైనర్ల ఎగుమతిని ప్రారంభించింది. ఒమన్ నుండి వచ్చిన బెంటిన్‌విల్లీ నౌక ద్వారా 17వతేదీ ఈ రవాణా సేవలను ప్రారంభించారు. కాంకర్ గ్రూప్ ఈ ఎగుమతులను నిర్వహిస్తోంది. ఈ సర్వీసు ద్వారా ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్నాటక, ఉత్తర తమిళనాడు ప్రాంతాల్లో కంపెనీల వాణిజ్య రవాణాకు ఎంతో సౌకర్యంగా ఉండబోతోంది. అలాగే బియ్యం, పొగాకు, గ్రానైట్, సిమెంట్, జర్కిన్స్ వంటి వాటి ఎగుమతికి, న్యూస్ ప్రింట్, వేస్ట్‌పేపర్, మెషినరీ, ఆటో కంపోనెంట్స్, ఫర్నీచర్ దిగుమతికి ఈ నౌక రవాణా సేవలు ఉపయోగపడనున్నాయి. ఈ కార్యక్రమంలో కృష్ణపట్నం పోర్టు సిఇఓ అనిల్ ఎండ్లూరి, కెపిసిటి సిఇఓ నిమ్మగడ్డ జితేంద్ర, కంకర్ గ్రూప్ జిజిఎం డాక్టర్ అనూప్ దయానంద్ సాధు, బిజురవి, బ్రిజేష్ దినకర్, బాలకృష్ణన్, పోర్టు పిఆర్‌ఓ హెడ్ వేణుగోపాల్, పోర్టు మీడియా మేనేజర్ బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### చిన్నారి లోకానికి కానుకగా

## 'రిచ్' సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మంత్రి పి.నారాయణ

నెల్లూరు, పొగతోటలోని రవి చిన్నపిల్లల ఆసుపత్రి అంటే... ఈ జిల్లాలోనే కాదు, చుట్టుపక్కల జిల్లాల్లోనూ ఎంతో పేరు. చెన్నై, హైదరాబాద్ వంటి మహానగరాలకు వెళ్లే పని లేకుండా తమ ఆసుపత్రిలోనే చిన్నారులకు ఇంతకాలం అత్యాధునిక వైద్య సౌకర్యాలు అందిస్తూ వచ్చారు. 'రిచ్' హాస్పిటల్‌గా వున్న రవి చిన్నపిల్లల ఆసుపత్రి సింహపురి వైద్యరంగాన ఇప్పుడు మరో ముందడుగు వేసింది. నెల్లూరులోనే తొలిసారిగా అంతర్జాతీయ వైద్య ప్రమాణాలతో 'రిచ్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్'గా విశాలమైన భవనంలో రూపుదిద్దుకుంది. ఈ నెల 15వ తేదీన రిచ్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌ను రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి పొంగూరు నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ తన ప్రసంగంలో 30ఏళ్లుగా చిన్నపిల్లకు వైద్య సేవలందిస్తూ, ఇప్పటివరకు 7లక్షల మందికిపైగా చిన్నారులకు వైద్యాన్ని చేసిన రవికుమార్‌ను అభినందించారు. నెల్లూరులో చిన్నపిల్లల డాక్టర్ అంటే ముందుగా గుర్తొచ్చేది రవికుమారేనని అన్నారు. ఈ ఆసుపత్రిని నెలకొల్పడం ద్వారా నెల్లూరుతో పాటు చుట్టుపక్కల జిల్లాల ప్రజలు కూడా ఇక చంటి బిడ్డలను ఎత్తుకుని అత్యవసర వైద్యం కోసం చెన్నై, హైదారాబాద్‌లకు పోవాల్సిన అవసరం లేకుండా నెల్లూరులో రిచ్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రికి తీసుకురావచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యదావ్, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ప్రభుత్వాసుపత్రుల అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరసింహరావులు పాల్గొన్నారు. ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ టి.వసంతలక్ష్మి, ఛైర్మెన్ డాక్టర్ టి.రవికుమార్‌లు అతిథులను సత్కరించారు.

## గౌరమ్మకు ఎంత గౌరవం?



చదువుకు ఉండే విలువ ఇక ఎందులోనూ రాదు. పేద, ధనిక తేడా లేకుండా అందరూ గౌరవించబడేది చదువు ద్వారానే! నెల్లూరు డికెడబ్ల్యూ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన గౌరమ్మ కూడా ఇలా చదువుతోనే ఈరోజు అత్యున్నతంగా గౌరవించబడుతోంది. ఇంటర్ ఎంపిసిలో గౌరమ్మ 971మార్కులు సాధించింది. ఆమెది నెల్లూరురూరల్‌లోని నారాయణరెడ్డిపేట. రమేష్ – చిన్నమ్మ తల్లిదండ్రులు. చాలా పేదోళ్లు. తండ్రి బేల్దారి పని చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కార్పొరేట్ కాలేజీలో చదివే స్థోమత లేకున్నా ప్రభుత్వ కాలేజీలో చదివి మంచి మార్కులతో తల్లిదండ్రుల ఆశలకు ప్రతిరూపంగా నిలిచిన గౌరమ్మకు 'లాయర్' అభినందనలు.

### తెలుగు నాటకరంగం..

# ఓ చైతన్య స్ఫూర్తి

**- ఆచార్య మొదలి నాగభూషణశర్మ**



ఆచార్య మొదలి నాగభూషణ శర్మను సత్కరిస్తున్న ముఖ్యఅతిథులు

తెలుగు నాటకరంగం ఓ చైతన్యస్ఫూర్తి అని, ప్రజల్లో చైతన్యం కలిగించడంలో తెలుగునాటక రంగం పాత్ర అమోఘమైనదని హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత డీన్ ఆచార్య మొదలి నాగభూషణశర్మ అన్నారు. నెల్లూరులోని వర్ధమాన సమాజం ఆధ్వర్యంలో ఈనెల 16వతేదీ సాయంత్రం టౌన్‌హాల్ ప్రాంగణంలోని శ్రీ రేబాల లక్ష్మీనరసారెడ్డి (జూనియర్) సమావేశమందిరం క్రింది హాలులో నిర్వహించిన ప్రసిద్ధ చరిత్రకారుడు నేలనూతల శ్రీకృష్ణమూర్తి (ఎన్నెస్కె) 13వ స్మారకోపన్యాసం కార్యక్రమంలో ఆయన పాల్గొని 'తెలుగు నాటకరంగం' అనే అంశంపై ఉపన్యసించారు. నాటక సమాజాలు క్రమశిక్షణతో సంఘటితగా ఏకసూత్రంపై నడచినప్పుడు తెలుగు నాటకరంగం ఉన్నతదశలో వుండేదని, క్రమం తప్పినప్పుడు క్షీణదశకు చేరిందన్న విషయం చరిత్ర చెప్తోందని ఆయన అన్నారు. తెలుగు నాటక రంగం అభివృద్ధికి క్రమశిక్షణ తప్పనిసరి అని ఆయన అన్నారు. గతంలో నాటకరంగ విస్తరణలో తెలుగు నాటకసమాజాలు చేసిన కృషి ఎంతో గొప్పదని, నాటి చైతన్యస్ఫూర్తిని నేటి తరంలో కూడా పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా వుందని ఆయన అన్నారు. అనంతరం ఆయన వర్ధమాన సమాజం ఆధ్వర్యంలో నేలనూతల శ్రీకృష్ణమూర్తి స్మారక సన్మానాన్ని అందుకున్నారు. వర్ధమాన సమాజం అధ్యక్ష కార్యదర్శులు వంటేరు వెంకటకృష్ణారెడ్డి, మజ్జిగ ప్రభాకరరెడ్డిల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ రంగస్థల నటులు పొన్నాల రామసుబ్బారెడ్డి, వల్లకవి వెంకటసుబ్బారావు, సాహితీవేత్తలు వేదం వేంకటరామన్, నేలనూతల శ్రీనివాసమూర్తి, మెట్టు రామచంద్రప్రసాద్, డాక్టర్ కాళిదాసు పురుషోత్తం, ఎన్.సుందరబాబు, బిరదవోలు రామిరెడ్డి, జివి రమణమూర్తి, డాక్టర్ ఏవి సుబ్బరాయుడు, డాక్టర్ మధుసూదనశాస్త్రి, డా. ఎం.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రచందనం రక్షణకు టాస్క్‌ఫోర్స్

గూడూరు డిఎస్పీ కార్యాలయంలో డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్‌తో టాస్క్‌ఫోర్స్ తిరుపతి విభాగం డిఐజి కాంతారావు ఆదివారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. తొలుత జిల్లాలోని దక్కిలి మండలం మాదాయపాళెం సమీపంలో పట్టుకొన్న 18ఎర్రచందనం దుంగలను పరిశీలించారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డిఐజి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో దాదాపు 80లక్షల ఎర్రచందనం చెట్లు ఉన్నాయని, వాటిని సంరక్షించేందుకు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి నిత్యం అన్ని శాఖల అధికారుల సమన్వయంతో విస్తృతంగా దాడులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. 2013 తరువాత ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ బృందం సర్వేలో 5.16లక్షల హెక్టార్లలో ఇప్పటి వరకు దాదాపు 15లక్షల ఎర్రచందనం చెట్లను స్మగ్లర్లు నరికివేశారని, ఉన్నవాటిని కాపాడుకునేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో పోలీసులు, అటవీ ప్రత్యేకదళం పోలీసులు, తదితర శాఖలతో వెలుగొండ ప్రాంతాల్లోని విలువైన ఎర్రచందనం తరలింపు లేకుండా చెక్‌పోస్టులు, విస్తృతంగా కూంబింగ్ చేస్తూ అక్రమ రవాణాలను అరికట్టడం విజయవంతంగా సాగుతోందని తెలిపారు. కొంతకాలంగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రంలోని సరిహద్దు ఏడు జిల్లాల్లోని కూలీలు అక్కడ అటవీ సంపదను కొల్లగొట్టారని, ప్రస్తుతం వారే చిత్తూరు, కడప, నెల్లూరు తదితర జిల్లాల్లోని ఎర్రచందనాన్ని నరుకుతున్నారని పేర్కొన్నారు. దీని నియంత్రణకు రాష్ట్రప్రభుత్వం నుంచి తమిళనాడు ప్రభుత్వానికి సమాచారం ఇచ్చి పీడీయాక్టు అమలు చేస్తామని హెచ్చరించారు. కార్యాదళంతో సమర్ధంగా కూంబింగ్ చేసి క్రమేపీ అక్రమ రవాణా తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్, వెంకటగిరి సిఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డిఐజి కాంతారావు, పక్కన డిఎస్పీ శ్రీనివాస్

## కౌన్సిలర్ల సహకారంతో పట్టణాభివృద్ధి

గూడూరు పట్టణాభివృద్ధికి కౌన్సిలర్ల సహకారం అవసరమని గూడూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన పేర్కొన్నారు. 16వ తేదీ పట్టణంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో అత్యవసర సమావేశం జరిగింది. పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందన్నారు. అనంతరం అజెండాలోని పలు అంశాలపై చర్చించారు. వాటిని కౌన్సిల్ ఆమోదించింది. ఈ పనులను ఛైర్‌పర్సన్ మినిట్‌బుక్‌లో పొందుపరిచారు. తొలుత అభివృద్ధి పనులు ఆమోదం విషయంలో తెలుగుదేశం పార్టీ, వైకాపా కౌన్సిలర్ల మధ్య వాదోపవాదాలు జరిగాయి. అన్ని అంశాలపై కౌన్సిలర్ నాగులు అభ్యంతరం తెలుపగా, వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్ వాటిని ఉపసంహరించుకున్నారు. కౌన్సిలర్లు లేవనెత్తిన పలు ప్రశ్నలకు కమిషనర్ మోదకొండ వివరణ ఇచ్చారు.

### పెంచలకోన ఆలయ

## నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన ఆలయానికి నూతన పాలకవర్గం ఏర్పాటైంది. ఆ మేరకు ఆదివారం నూతన పాలకమండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీరామమూర్తి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో, నూతన పాలకమండలి సభ్యులు తానంకి నానాజీ, పీర్ల సోమయ్య, రావి సత్యనారాయణ, పాయసం గోపాల్, సాగి నరసింహనాయుడు, వేణుంబాక జ్యోతమ్మ, గితంగి చిన్నయ్య, రాచకొండ జగదీష్‌నాయుడు, పదకమూరి విజయ, వరదబండి హరనాధ్‌రెడ్డి, సన్నపనేని వేణుగోపాల్ నాయుడుతో పాటు, ఎక్స్‌అఫిషియో సభ్యునిగా గుండ్లూరు సీతారామయ్యస్వామితో ప్రమాణస్వీకారోత్సవం ఘనంగా జరిగింది. అనంతరం సభ్యులంతా కలసి ఏకగ్రీవంగా తానంకి నానాజీని పాలకవర్గ ఛైర్మెన్‌గా ఎన్నుకున్నారు. వీరందరికీ ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు అందించి, స్వామివార్ల చిత్రపటాలను, ప్రసాదాలను అందజేశారు. తొలుత ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆలయాన్ని సందర్శించి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కురుగొండ్ల మాట్లాడుతూ, ఏటా పెంచలకోన ఆలయానికి సుమారు అయిదున్నర కోట్ల రూపాయలు ఆదాయం వస్తోందని తెలిపారు. త్వరలో ఆలయంలో 2 కోట్లతో అలివేటి మండపం, మరో మూడున్నర కోట్లతో అతిథిగృహాల నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. 5వేల మంది ఒకేసారి భోజనం చేసేలా పెద్దదైన భోజనశాలను కూడా నిర్మించేందుకు కృషి జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మెన్ ప్రసాద్‌నాయుడు, పెంచలకోన ఆలయ మాజీ ఛైర్మెన్ శ్రీరాములశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

### ఎస్‌కెఆర్ కళాశాలలో

## పూర్వవిద్యార్థుల సమ్మేళనం



గూడూరు ఎస్‌కెఆర్ కళాశాలలో 1986-89 సంవత్సరంలో బిఏ డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఎస్‌కెఆర్ కళాశాల ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. కలసిన ప్రతి ఒక్కరూ వాళ్ళ అనుభవాలను పంచుకొన్నారు. ఎస్‌కెఆర్ కళాశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని, అందుకోసం కళాశాల పూర్వ విద్యార్థి సంఘానికి ఆర్థిక సహకారం అందించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఇటువంటి కార్యక్రమాలతో సంవత్సరానికి ఒక్కసారైనా కలుసుకోవాలని కుటుంబ సంబంధిత కార్యక్రమాలలో కూడా అందరూ భాగస్వాములు అవ్వాలని కోరారు. ఈ కార్యక్రమ నిర్వహణలో మల్లాం సుబ్రహ్మణ్యం, దండు మధుసూదనరెడ్డి, మధుసూదనరావు కీలక పాత్ర పోషించారు. హైదరాబాద్ నుంచి వేణుగోపాల్‌రెడ్డి, ఖమ్మం నుండి జయరామిరెడ్డి, చెన్నై నుండి వేదవల్లి, లక్ష్మీప్రసూన, పల్లం వేణుగోపాల్, శ్రీకాళహస్తి నుంచి టి.సురేంద్రబాబు, రమణయ్య, సి.హెచ్.శివకుమార్ తదితర పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన ఎన్టీఆర్ సేవా సమితి



మాట్లాడుతున్న విజయమోహన్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే సునీల్, ఛైర్‌పర్సన్ దేవసేన

గూడూరులోని ఎన్టీఆర్ సీనియర్ అభిమానులందరూ కలసి యోగాచార్య కట్టా మురళీకృష్ణ పర్యవేక్షణలో యోగా సెంటర్ నందు ఎన్టీఆర్ సంక్షేమ సంఘ సేవాసమితిని 16వ తేదీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తారక రామారావు విగ్రహానికి తమవంతు కృషి చేస్తామన్నారు. అందరి హృదయాల్లో ఆయన ఉన్నారని, అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా కళాకారుడు షేక్ షరీఫ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి చేవూరు విజయమోహన్‌రెడ్డి, కె.మురళీకృష్ణ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## దర్గావీధిలో చలివేంద్రం




చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు పట్టణంలోని దర్గావీధి ప్రాంతంలో చలివేంద్రాన్ని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ప్రారంభించారు. దీన్ని దర్గా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాతలు ప్రజల దాహార్తిని తీర్చేందుకు వేసవిలో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అయిదో వార్డు కౌన్సిలర్ వాటంబేటి శివకుమార్, అహమద్, రహీమ్, నాజర్, రహంతుల్లా, జిలాని భాషా, ఖాదర్‌భాష, అజీజ్‌ఖాన్, బాబు, గౌస్, జీహని, మగ్దూమ్ తదితరులు పాల్గొన్నారు.

## సుశిక్షితులైన ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దుతాం




మాట్లాడుతున్న కె.చంద్రమోహన్, ప్రక్కన సుబ్బారెడ్డి, మనోహర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

రాబోవు విద్యాసంవత్సరానికి సుశిక్షితులైన ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దేందుకు ప్రైవేటు పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు త్వరలో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని గ్రీన్‌వ్యాలీ పాఠశాలలో ఆదివారం గూడూరు డివిజన్ పరిధిలోని ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ రాబోవు విద్యా సంవత్సరం దృష్టిలో ఉంచుకొని తమ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించేలా చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మరియు ఎల్‌ఏపి స్కూల్ కరస్పాండెంట్ బి.శ్రీకాంత్‌రెడ్డి, గూడూరు నియోజకవర్గ అధ్యక్షులు కె.చంద్రమోహన్, గూడూరు స్కూల్స్ గౌరవాధ్యక్షులు దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### లోక కళ్యాణమే ధ్యేయంగా...

# పౌండరీక మహాయాగం

## లక్ష హోమాత్మక చండీయాగం



నెల్లూరురూరల్ మాదరాజుగూడూరులోని ఓ ప్రైవేట్ ప్రాంగణం ఒక మహత్తర ఆథ్యాత్మిక కార్యక్రమానికి వేది కయ్యింది. మార్చి 18వ తేదీ నుండి ఏప్రియల్ 25వ తేదీ వరకూ జరుగుతున్న ఈ అపూర్వ కార్యక్రమం లోకకళ్యాణార్ధం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చెప్తున్నారు.

శ్రుతి అంటే వేదములు. సమస్త జీవరాసుల యొక్క సృష్ఠిని గురించి చెప్పేది ఋగ్వేదం. స్థితి సంస్కారముల గూర్చి యజుర్వేదం, స్వరశక్తితో ప్రకృతిని శుద్ధి పరచి ఆనందాన్ని పొందడానికి సామవేదం, అణువులను ఛేదించి లయం చేయడానికి కణములను కలిపి జీవింపచేయడానికి అధర్వవేదం. ఈ నాలుగు వేదాల ప్రామాణికమైన యజ్ఞవిధానం తెలిపేది శ్రౌతకర్మలు. శ్రౌతకర్మలంటే సోమయాగాది క్రతువులు. అలాంటి సోమయాగ క్రతువులో అత్యున్నతమైనది "చతుర్ధ మహాగ్నియుక్త అహీన వ్యూఢ ద్వాదశాహ పౌండరీక మహాయాగము". ఈ యాగమే ఇప్పుడు గత 34రోజులుగా మాదరాజుగూడూరులో జరుగుతోంది.

ఎప్పుడో 60సంవత్సరాల క్రితం బ్రహ్మశ్రీ వెంకటాచల మహాగ్నిచిథ్సర్వపృష్టాప్తోరామ సర్వతోముఖ ద్విషాహస్రాగ్ని యుక్త వ్యూఢపౌండరీకాప్త వాజపేయ బృహస్పతి సవాత్యగ్నిష్టోమ సమస్యకారకోక్థ్య త్రిషాహస్రాగ్ని సమూఢపౌండరీక చతుర్ధమహాగ్నియుక్తాహీన వ్యూఢ ద్వాదశాహ సౌమిక చాతుర్మాస్య ఋతపేయ జ్యోతిర్వాజపేయ షోడశి జ్యోతిస్త్రికద్రుక గోస్త్రికద్రుక ఆయుస్త్రికద్రుక యాజులు గారి ఆధ్వర్యంలో గుంటూరుజిల్లాలో జరిగిన ఇలాంటి అరుదైన యాగం ఇప్పుడు మళ్ళీ వారి వారసుడు "కాండత్రయశ్రౌతి" రెండుచింతల శ్రీ యజ్ఞేశ్వర చంద్రశేఖర మహాగ్నిచిథ్సర్వతో ముఖాత్యగ్నిష్టోమ ద్విషాహస్రాగ్ని యుక్త సర్వపృష్ఠాప్తోర్యామ త్రిషాహస్రాగ్నియుక్త వ్యూఢపౌండరీక జ్యోతిర్వాజపేయ యాజులు నేతృత్వంలో భక్తిపూర్వకంగా జరుగుతోంది.

## సోమయాగం:

యజ్ఞం లేదా యాగం ఒక విశిష్టమైన హిందూ వైదిక సంప్రదాయం. భారతదేశంలో పురాణకాలం నుండి వివిధ రకాలైన యజ్ఞాలు జరిగాయి. దేవతలకు తృప్తి కలిగించడం యజ్ఞం లక్ష్యం. సాధారణంగా యజ్ఞం అనేది అగ్ని(హోమం) వద్ద వేదమంత్రాల సహితంగా జరుగుతుంది. ఇందుకు అనుబంధంగా అనేక నియమాలు సంప్రదాయాలు వున్నాయి.

వైదిక యజ్ఞంలో 'అధ్వర్యుడు' ప్రధాన అర్చకుడు. ఆయన ఆధ్వర్యంలో అన్ని కార్యక్రమాలు జరుగుతాయి. ఆయనకు సహాయంగా అనేక మంది అర్చకులు, పండితులు ఉంటారు. 'హోత' ఈయన ఆహుతికి పూర్వం మంత్రాలని పఠించి దేవతలను యజ్ఞభూమికి తీసుకొస్తాడు. ఉద్గాత వేదమంత్రాలు చదువుతాడు. ఇంకొకరు బ్రహ్మ హేతద్వరుల కార్యక్రమాన్ని పర్యవేక్షించడమే ఈయన పని. పొరపాటు వస్తే సరిదిద్దుతాడు. ఇంకొకరు 'అగ్నీత్తు' – బ్రహ్మకు సహకారి. యజ్ఞంలో ఒకటిగాని అంతకంటే ఎక్కువగాని హోమాగ్నులు వుంటాయి.

**కలియుగంలో చేయదగిన మహాయాగాలు సప్త సోమయాగాలు:**

1. అగ్నిష్టోమం
2. అత్యగ్నిష్టోమం
3. ఉక్థ్యం
4. పౌండరీకం
5. వాజపేయం
6. అతిరాత్రం
7. అప్తోర్యామం

అగ్నిహోత్రంతో సశాస్త్రీయ సనాతన భారతీయ వేదవిజ్ఞాన విధానం ద్వారా ప్రకృతిలో జీవశక్తిని పెంచుటకు సోమలత నుండి తీయు సోమరసాన్ని ప్రకృతికి(దేవతలకు) సమర్పించడమే సోమయాగం.

సోమ అంటే చంద్రుడు అని(స+ఉమ) ఈశ్వరుడని అర్ధం. ఉమ అంటే శక్తి. శివుడు శక్తి సహితుడు అంటే పదార్ధాన్ని శక్తిని కలిపి సంధానపరిచే చాంద్రీయశక్తి సోమలత. ఇది ఒక లత(తీగ). భూమండలంపైన ప్రతి మొక్క(ఔషది) చంద్రశక్తి వలననే పెరుగుతుంది. చంద్రుడు మనఃకారకుడు. చంద్రకాంతి ప్రకృతిని, జీవుల మనస్సును ప్రభావితం చేస్తుంది. చంద్రకళలతో సమానంగా పెరుగుతూ సమానంగా తిరిగే ఏకైక ఔషద రాజము సోమలత. అమితంగా చంద్రశక్తిని గ్రహించే ఏకైక లత సోమలత.

సోమయజ్ఞ నిర్వహణ అంటే సాధారణమైన సత్యవ్రతం. తిరుకళ్యాణం, రుద్రాభిషేకం, నిత్యపూజలాంటి భక్తి మార్గంలో చేసేవి కావు. అవి మనస్సును భగవంతుని వైపు మళ్లించే సంతోషదాయక క్రియా కలాపాలు. వాటికి ఒక సామాజిక, మానసిక పౌరాణిక నేపథ్యం ఉంటుంది. కాని యజ్ఞాలు వాటికి భిన్నమైనవి. సోమయజ్ఞ నిర్వహణ పౌరాణికం కాదు అది వేద సంబంధం. జ్ఞాన శాస్త్ర సంబంధమైనవి. పురాణోక్తకర్మలతో స్థితిని బట్టి కాలానుగుణంగా మార్పులు చేసుకోవచ్చు. కాని వేద యజ్ఞాలలో అలా కుదరదు. అవి నిర్ధేశించిన ప్రకారమే జరగాలి. సోమయజ్ఞంలో సోమవల్లీ రసం ప్రధానం. ప్రకృతిలో జీవశక్తిని పెంచుటకు సోమలత నుండి తీయు సోమ రసాన్ని అగ్ని ద్వారా దేవతలకు సమర్పించడం.

'వేదానాం సామవేదోస్మి' అని జగద్గురువైన శ్రీకృష్ణులు చెప్పారు. సామం లేకపోతే యాగం లేదు. సామయాగంలో సామవేదమే ప్రధానం.

## యాగఫలం:

సోమయాగం ఆచరించడం వలన ప్రకృతికి ఏవి అవసరమో అవి తప్పనిసరిగా ప్రాప్తిస్తాయి. సోమరసంతో హోమం చేస్తే ప్రకృతిలోని సమస్త మూల కణములు శుద్ధి చేయబడి జీవశక్తి పెరుగుతుంది. సోమయాగం జరిగినచోటేగాక, హోమ ధూమం వెళ్లిన చోటల్లా స్వచ్ఛమైన గాలి వుంటుంది. భూగర్భ జలములు పైకి అందుతాయి. భూమిలో ఖనిజశక్తి పెరుగుతుంది. సకాల వర్షములు పడతాయి. జీవ జాతులలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. హానికర సూక్ష్మ క్రిములు(బ్యాక్టీరియా) వుండవు. సస్యవృద్ధి(పంటలు) కలుగుతుంది. మానవుడికి చెడు ఆలోచనలు రావు. పై సోమయాగంలో భాగమే ఇప్పుడు మన జిల్లాలోని మాదరాజుగూడూరులో అనేకమంది ఆధ్యాత్మికవేత్తల సహకారంతో జరుగుతున్న పౌండరీక యాగం. ఏప్రియల్ 25వ తారీఖున మహాపూర్ణాహుతితో ముగియనున్న ఈ యాగం సకల జనావళికి అన్ని శుభములు చేకూర్చాలని, ముఖ్యంగా నెల్లూరు జిల్లా సస్యశ్యామలమై ప్రజలు సుఖ శాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షిద్దాం!



# విశ్వసాయి విజయదుందుభి




ఇంటర్‌మీడియట్ ఫలితాల్లో నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో వున్న విశ్వసాయి కళాశాల విజయదుందుభి మ్రోగించింది. ఎంపిసి, బైపిసి విభాగాల్లో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించడమే కాక, జిల్లాస్థాయిలో ఈ కళాశాల అగ్రగామిగా నిలిచింది. సీనియర్ ఇంటర్ బైపిసిలో వి. కీర్తికృష్ణ వెయ్యికి 988 మార్కులు సాధించి ప్రధమస్థానంలో నిలవగా, ఎం.చిత్రనిఖిత, డి.శ్రావణలక్ష్మి 986 మార్కులతో ద్వితీయ స్థానంలోనూ, వై.భావన 985 మార్కులతో తృతీయస్థానంలోనూ నిలిచారని కళాశాల నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా సీనియర్ ఇంటర్ ఎంపిసిలో ఏ.శ్రీహర్ష 986 మార్కులతో ప్రధమస్థానంలో, కె.సాయి కృష్ణతేజ 985 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలోనూ, ఎం. అశ్రితారెడ్డి, పి.శ్రీవిద్య 983 మార్కులు సాధించి తృతీయ స్థానంలోనూ నిలిచారని వారు పేర్కొన్నారు. వీరు కాక, మరో 23 మంది విద్యార్ధులు 980 మార్కులకు పైగానే సాధించి అత్యుత్తమ ఫలితాలను సాధించారన్నారు. జూనియర్ ఇంటర్ బైపిసిలో పి.తేజోవర్షిణి 440 మార్కులకు గాను 435 మార్కులు సాధించి ప్రధమస్థానంలో నిలవగా, డి.భవ్యస్ఫూర్తి, బి.పవన్‌తేజ, డి.మేఘన, బి.సాయిప్రత్యూష, పి.సాయిస్పందన, ఎన్.శ్రీశ్రిత 434 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారని, ఈ విభాగంలో మొత్తం 40 మంది విద్యార్ధులు 430 మార్కులకు పైగానే సాధించారన్నారు. జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో ఎస్.వినీల 470మార్కులకు గాను 465 మార్కులు సాధించి ప్రధమస్థానంలో నిలవగా, ఎన్.ఆర్షియ, పి.కవిత, కె. రోహిత, కె.హితేష్ అరవింద్ 464 మార్కులతో ద్వితీయస్థానంలోనూ, మరో అయిదుగురు విద్యార్ధులు 463 మార్కులు సాధించి తృతీయస్థానంలోనూ నిలిచారని, మొత్తం 16మంది విద్యార్ధులు 460 మార్కులకు పైగానే సాధించారని, ఇంటర్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఈ విద్యార్ధులందరినీ కళాశాలవారు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్ధులకు అభినందన సభలో కళాశాల ఛైర్మెన్ డా.ఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ, కళాశాలలో సరైన ప్రణాళికతో విద్యాబోధన జరగడం వల్ల మంచి ఫలితాలు వచ్చాయని, అటు విద్యార్ధుల కృషి ఇటు తల్లిదండ్రుల ప్రోత్సాహం కలసి ఇంతటి అద్భుత విజయం సాధించగలిగామని అన్నారు. విద్యార్ధులందరినీ ఆయన ఈ సందర్భంగా అభినందించారు. కళాశాల డైరెక్టర్ విశ్వమోహన్ మాట్లాడుతూ, విద్యాబోధనలో అనుసరించిన సరికొత్త విధానాలు, నిరంతర పర్యవేక్షణతోనే ఈ విజయం సాధ్యమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్ధులు, ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు, కళాశాల ప్రిన్సిపల్స్, సిబ్బంది పాల్గొన్నారు.


# పురిటిబిడ్డకు ప్రాణం పోసిన అపోలో వైద్యులు



కేవలం కేజీ బరువుతో జన్మించిన పురిటిబిడ్డను అత్యుత్తమ సేవలు అందించి ప్రాణంపోసి కాపాడినట్లు అపోలో ఆసుపత్రి చిన్నపిల్లల వైద్యనిపుణురాలు డాక్టర్ రూపా తెలిపారు. బుధవారం ఆసుపత్రిలో విలేకర్లతో ఆమె మాట్లాడుతూ నెల్లూరు వాస్తవ్యురాలు అమీనాకు గర్భంతో ఉన్నప్పుడు ఉమ్మనీరు తగ్గి బిడ్డ ఎదగకపోవడంతో 8వ నెలలోనే వేరే ఆసుపత్రిలో ఆపరేషన్ చేసి బిడ్డను డెలివరీ చేయడం జరిగిందని, బిడ్డ ఊపిరితిత్తుల్లో సమస్య రావడంతో ఆయాసం వచ్చిందన్నారు. తల్లిదండ్రులు ఆ బిడ్డను అపోలో ఆసుపత్రికి తీసుకొచ్చారని, వెంటనే తాము పురిటిపిల్లల ఐసియూ విభాగానికి తరలించి మిషన్ ద్వారా కృత్రిమ శ్వాసనిస్తూ అత్యుత్తమ సేవలు అందించి బిడ్డ ప్రాణాలు కాపాడామన్నారు. బిడ్డ ప్రాణాన్ని కాపాడినందుకు ఆసుపత్రి యూనిట్ హెడ్ నవీన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్వేత, వైద్యసిబ్బందిని అభినందించారు.



# కల్యాణ వైభవం...!



వేమిరెడ్డి సనత్‌కుమార్‌రెడ్డి - శ్రీపద్మల కుమారుడు **రాహుల్‌రెడ్డి - దీపిక** (గుర్గాన్ వాస్తవ్యులు హెచ్‌ఎస్ అహ్లావాట్ - శ్రీమతి వేదవతిల కుమార్తె)ల కల్యాణం ఏప్రియల్ 16వ తేదీ హైదరాబాద్‌లోని హోటల్ అవాస నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



నెల్లూరు వేదాయపాలెం రైల్వేస్టేషన్ మేనేజర్ షేక్ షాజహాన్ కుమారుడు **జావెద్ ఇమామ్ - మహ్మద్ మొసీన** (నెల్లూరు వాస్తవ్యులు మహ్మద్ ముత్తహర్ కుమార్తె)ల నిఖా ఈ నెల 17వ తేదీ నెల్లూరు సిపిఆర్ కళ్యాణ మండపంలో జరుగగా, ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి తదితరులు హాజరై వరుడుకు శుభాకాంక్షలు తెలిపారు. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.



శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి - ఉమల కుమారుడు **వికాశ్‌రెడ్డి - గమన** (గూడూరు వాస్తవ్యులు యల్లంటి వేణురెడ్డి - మమతల కుమార్తె)ల వివాహం ఈ నెల 21వ తేదీ నెల్లూరులోని సిపిఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనలు.



# కావలి కబుర్లు

## నూతన రాజధాని నిర్మాణానికి
# చంద్రబాబు కృషి ఎనలేనిది



చంద్రబాబు జన్మదిన వేడుకల్లో మిఠాయిలు పంచుకుంటున్న టిడిపి నాయకులు

ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు చేస్తున్న కృషి ఎనలేనిదని కావలి పట్టణ టిడిపి అధ్యక్షులు మల్లిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో కావలి నియోజక వర్గ తెలుగు దేశం పార్టీ ఇన్‌చార్జ్, రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు, మాజీ శాసనసభ్యులు బీదా మస్తాన్ రావు ఆదేశాల మేరకు పట్టణ అధ్యక్షులు మల్లిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు 67వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి పట్టుదల అభినందనీయమని కొనియాడారు. బాబు జన్మదినం రోజున ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, తల్లిదండ్రులకు అవగాహన కల్పించి విద్యార్థులను ప్రభుత్వపాఠశాలల వైపు మళ్ళించేందుకు మనఊరు – మనబడి కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందదాయకం అన్నారు. ముఖ్యమంత్రి చేస్తున్న కృషిలో తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి అమరా వేదగిరి గుప్త, ఆత్మకూరు బ్రహ్మయ్య, జ్యోతి బాబూరావు, జి వేణుగోపాల్, జి రాజ్‌కుమర్ చౌదరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పి శ్రీనివాసులు, కౌన్సిలర్‌లు బి శివకుమార్, కె శ్రీనివాసులు, మల్లికార్జున, మధు, ఇబ్రహీం, వెంకటేశ్వర్లు నాయుడు, శ్రీహరి నాయుడు, శ్రీకాంత్, పద్మావతిశ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# 'లాయర్' వేదికపై సేవా వేడుక



బర్త్‌డే కేక్‌ను కట్ చేస్తున్న మాగుంట శరత్‌చంద్రారెడ్డి, పక్కన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జె.కె.రెడ్డి, వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి

ఎక్కడ సేవకులుంటే అక్కడ 'లాయర్' ఉంటుంది. ఎవరు సేవ చేస్తున్నా వారిని భుజం తట్టి చప్పట్లు కొట్టి ప్రోత్సహిస్తుంది. తన పుట్టినరోజు సందర్భంగా ఏప్రియల్ 15వ తేదీ నెల్లూరు పురమందిరంలోని ఓపెన్ ఆడిటోరియంలో 240 మంది చేత రక్తదానం చేయించి రేపటి యువతకి ఆదర్శంగా నిలిచిన మాగుంట శరత్‌చంద్రారెడ్డిని ఆయన సైనిక బృందాన్ని 'లాయర్' అభినందించింది. శ్రీరామ నవమి సంబరాలలో భాగంగా శరత్‌చంద్రారెడ్డి జన్మదినాన్ని కూడా నిర్వహింపజేసింది. సాయి యూత్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేయించి శరత్‌ని అభినందించింది. ఈ కార్యక్రమంలో శరత్‌చంద్రారెడ్డి యూత్ సభ్యులతో పాటు పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శరత్ యూత్‌ని అభినందించారు. 240మంది చేత రక్తదానం చేయించడం మంచి కార్యక్రమమని, ఎవరైనా పుట్టినరోజులకు ఇలాంటి ఆదర్శవంతమైన కార్యక్రమం చేయాలని పిలుపునిచ్చాడు. ఈ కార్యక్రమంలో మాజీశాసనసభ్యుడు జె.కె.రెడ్డి, వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, మాగుంట వెంకటనారాయణరెడ్డి, తారక్, సాయి యూత్ సారధి సాయి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# విఆర్‌సి వాకర్స్ శ్రీరామనవమి వేడుకలు



విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15న శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా పందిళ్లపల్లి పట్టాభిరామిరెడ్డి వ్యవహరించారు. పానకం, వడపప్పు, లడ్డూలను పంపిణీ చేశారు. పేదలకు వస్త్రదానం చేశారు. ఈ కార్యక్రమం వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. మహిళా వాకర్స్ అధ్యక్షురాలు అనూరాధ, డాక్టర్ సులోచనమ్మ, డాక్టర్ చంద్రలీల, డా॥ భాస్కర్‌రావు, పెంచలయ్య, మూర్తి, వెంకటేశ్వర్లు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

# 24న 'జగన్స్ స్టార్టప్' సాఫ్ట్‌వేర్ సంస్థ



జగన్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నెల్లూరులో స్టార్టప్ సాఫ్ట్‌వేర్ కంపెనీని మొదటిసారిగా ఈ నెల 24న ప్రారంభిస్తున్నట్లు జగన్స్ విద్యాసంస్థల అధినేత జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం నెల్లూరులోని ఓ హోటల్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులోని మహేశ్వరి పరమేశ్వరి కళ్యాణ మండపంలో 'స్టార్టప్'ను లాంచింగ్ చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఒరాకిల్ కంపెనీ సీనియర్ డైరెక్టర్ కొత్తకోట వెంకి, విజన్ సాఫ్ట్‌వేర్ ఛైర్మెన్ సుధాకర్‌రెడ్డి, స్క్నైడర్ కంపెనీ ప్రతినిధి టి.శ్రీనివాసులురెడ్డిలు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా అన్ని కళాశాలల విద్యార్థులు, కంపెనీల సిఇఓలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంపెనీలు, కళాశాలల కలయికలో భాగంగా విజన్ సాఫ్ట్‌వేర్ కంపెనీతో జగన్స్ కళాశాల ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్‌లో 60శాతం మార్కులు సాధించిన వారికి ఖచ్చితంగా ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రయత్నిస్తున్నామన్నారు. రాబోయే రెండేళ్లలో వెయ్యిమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జగన్స్ కళాశాల ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

# ఉష్ణోగ్రతలు తగ్గించేందుకు చంద్రబాబు ప్లాన్

గల్పిక

ఢిల్లీలోని ప్రధాని కార్యాలయం. ప్రధాని నరేంద్రమోడీ తన మంత్రివర్గ సహచరులు సుష్మాస్వరాజ్, రాజ్‌నాథ్‌సింగ్, అరుణ్‌జైట్లీ, మనోహర్ పారికర్, యం.వెంకయ్యనాయుడు, స్మృతిఇరానీలతో చర్చలు జరుపుతున్నారు. సుష్మా వుండి ప్రధానితో... సార్, నేను తిరగాల్సిన దేశాలన్నీ మీరే తిరిగేస్తున్నారు. విదేశీ వ్యవహారాల మంత్రి శాఖ నాకు మళ్ళీ మళ్ళీ వస్తుందా, మీరు కొద్దిరోజులు ఇండియాలోనే వుండి పరిపాలనా వ్యవహారాలు చూసుకుంటే ఆ విదేశాలేవో నేను తిరుగుతానంది. అందుకు మోడీ... నాక్కూడా తిరిగి తిరిగి విసుగొచ్చింది. అలాగే వెళ్లండని చెప్పాడు. దాంతో సంతోషంగా ఫీలయ్యింది. స్మృతి ఇరానీతో మోడీ... ఏమ్మా, దేశంలో అన్ని యూనివర్శిటీలు ప్రశాంతంగానే ఉన్నాయా, ఇప్పుడెక్కడా గొడవలు లేనట్లున్నాయే అని అడిగాడు. అందుకు స్మృతి... అవున్సార్, అన్ని చోట్లా ప్రశాంతంగానే వుంది. కాబట్టే రాహుల్‌గాంధీ ఇంటి పట్టునే ఉంటూ బోర్ కొడుతుందని గోల చేస్తున్నాడట. ఏ యూనివర్శిటీలో గొడవలు జరుగుతున్నాయా, అక్కడకు పరుగెత్తుకుంటూ పోదామా అని ప్రతిక్షణం టీవీ ఛానెల్స్ ముందు కూర్చుని చూస్తుంటాడంది. దానికి, అయ్యో! రాహుల్ నీకెంత కష్టమొచ్చింది అని అందరూ నవ్వుకున్నారు. అప్పుడే మోడీ ఫోన్ మోగింది. ఆయన ఫోన్ ఎత్తాడు. అవతల నుండి బిసిసిఐ అధ్యక్షుడు శశాంక్ మనోహర్... సార్, రైల్ ట్యాంకర్ల ద్వారా బాంబేకు నీళ్లు పంపించండి, ఇక్కడ బాగా ఇబ్బందిగా వుందని అడిగాడు. మోడీ స్పందించి.. శెభాష్, కేవలం క్రికెట్ పట్లే కాకుండా ప్రజల పట్ల కూడా మీరు బాధ్యతగా వ్యవహరిస్తున్నందుకు నా అభినందనలు, దాహంతో అల్లాడుతున్న ప్రజల దప్పిక తీర్చేందుకు ఇప్పుడే రైలు ట్యాంకర్ల ద్వారా నీళ్లు పంపిస్తాను అని చెప్పాడు. ఆ మాటకు శశాంక్ మనోహర్... సార్, నేను అడిగేది జనాలు తాగే నీళ్లను కాదు, వాళ్లు ఎటుపోతే నాకేంటి, ఇవతల ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. గ్రౌండ్‌లు తడపడానికి నీళ్లు లేవు, ప్రేక్షకులు నీళ్లు లేకున్నా వుంటారు గాని, క్రికెట్ మ్యాచ్‌లు చూడకుండా వుండగలరా? అందుకే పిచ్‌లు తడుపుకోవడానికి రైళ్ల ద్వారా నీళ్లు పంపించండని అడిగాడు. ఆ మాటకు ప్రధానితో పాటు మిగతా వాళ్లు కూడా అవాక్కయ్యారు. మోడీకైతే మండి... తాగడానికి నీళ్లు లేక జనాలు ఛస్తుంటే, నీకు క్రికెట్ ఆడ్డానికి నీళ్లు కావాలన్నా, పెట్టెయ్ ఫోన్ అంటూ ఫోన్ కట్ చేశాడు. తర్వాత మోడీయే... భవిష్యత్‌లో నీటి కష్టాలు పెరిగేటట్లున్నాయి, ఈ ఇబ్బందులు రాకుండా ఉండాలంటే నీటిని పొదుపు చేయాలి, మరి నీటి పొదుపు ఎలా చేయాలి అని అడిగాడు. అప్పుడు వెంకయ్యనాయుడు కలుగజేసుకుని... సార్, చాలామంది రోజుకు రెండు పూటలా స్నానం చేస్తున్నారు. దీనివల్ల ప్రతిరోజూ కొన్ని వందలకోట్ల నీరు వృధా అవుతోంది. దీనిబదులు పండుగలు, పబ్బాలకు స్నానం చేయమందాం. అది కూడా నీళ్లు వృధాపోకుండా ఊరికి రెండు లెక్కన స్త్రీ, పురుషులకు వేర్వేరుగా తటాకాలు కట్టి అందరినీ వాటిలోనే స్నానం చేయమందాం. రేషన్ కోటా మాదిరి ప్రతిమనిషి నెలకు ఒకసారే స్నానం చేయాలి, అంతకుమించి చేస్తే జరిమానాలు విధిద్దాం. ప్రతి రోజూ స్నానం చేసే వాళ్ల మీద దేశద్రోహం కేసులు పెడదాం అని చెప్పాడు. నీటి పొదుపు చర్యలు ఓకే.. ఈ పెరుగుతున్న ఉష్ణోగ్రతలేంటి? కరువేంటి... అసలు ఇంత ఎండలు కాస్తుంటే ఆ చంద్రబాబునాయుడు ఎలా తట్టుకుంటున్నాడు, అసలే ఆయన సీఎం అయితే ఎండలు, కరువు తప్పవనే ప్రచారం వుంది. ఇంతకీ ఆయన పరిస్థితి ఎలా వుందని అడిగాడు. వెంకయ్య స్పందించి... ఆయనకేం సార్, తిమ్మిని బమ్మిని చేయగల సమర్ధుడు. ఎడారిలో కూడా పడవ ప్రయాణం చేసే సత్తా వున్నోడు. ఆయన పాలనలో కరువొచ్చినా, పుష్కలంగా వర్షాలొచ్చినా ప్రజల బ్రతుకు చిత్రంలో మార్పేమీ ఉండదన్నాడు.

అదేంటి, వింతగా వుందే, ఆ ఫార్ములా ఏంటో చూద్దాం. అది సక్సెస్ అయితే దేశమంతా కూడా అదే ప్రవేశపెడదామని మోడీ అన్నాడు. అందరూ దానికి సరేనని ఏపికి బయలుదేరారు.

★★★★★

అది కృష్ణానది తీరాన ఏపి సీఎం కార్యాలయం. ఆ చుట్టుపక్కల ఎండకు తల దాచుకోవడానికి ఒక్క చెట్టు కూడా లేదు. గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో దిగిన మోడీ, ఆయన మంత్రులు కార్లలో అక్కడకు చేరుకున్నారు. కార్లు దిగాక అక్కడ కాస్తున్న ఎండకు వాళ్లకు దిమ్మ తిరిగింది. మోడీ, వెంకయ్యలు నేరుగా సీఎం కార్యాలయానికి వెళ్లారు. చంద్రబాబు, మంత్రులు పి.నారాయణ, దేవినేని ఉమ, ప్రత్తిపాటి పుల్లారావులు అన్ని జిల్లాల కలెక్టర్‌లతో కరువుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నాడు. నెల్లూరుజిల్లా కలెక్టర్ యం.జానకి వుండి... సార్, మా జిల్లాలో ఎండలు ఎక్కువగా ఉంటున్నాయి, ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు అని చెప్పింది. అందుకు చంద్రబాబు... ఉష్ణోగ్రతలు తగ్గించేందుకు మేం తీవ్రంగా కృషి చేస్తున్నాం, ఈ విషయంపై ఇప్పటికే కేంద్రంతోనూ మాట్లాడాను, అవసరమైతే కేంద్ర వాతావరణశాఖ సాయం కూడా తీసుకుంటాం, ఇక రాష్ట్ర వ్యాప్తంగా కరువును ప్రజలకు అలవాటు చేయండి, మంచి నీళ్లు తాగకుండా, ఆహారం తినకుండా ఎలా బ్రతకాలో ప్రజలకు నేర్పించండి... అని చెప్పి ఆమె లైన్ కట్ చేశాడు. తర్వాత అనంతపురం కలెక్టర్ లైన్‌లోకి వచ్చి... సార్, మా జిల్లాలో మంచినీళ్లకు ఇబ్బందిగా వుందని చెప్పాడు. అందుకు చంద్రబాబు... ఇలాంటి పరిస్థితులొస్తాయనే ముందుచూపుతోనే పక్క రాష్ట్రాల నుండి మద్యాన్ని భారీగా తెప్పించాం. రాష్ట్రంలో మంచినీళ్లు లేకపోయినా మద్యం వుంది. మంచినీళ్లు దొరక్కుంటే మద్యంతో గొంతు తడుపుకోమనండి అని చెప్పి పెట్టేసాడు. తర్వాత పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... సార్, మా గోదావరి ఎండిపోయింది, ఎక్కడనుండన్నా నీళ్లు తెప్పించండని అడిగాడు. దానికి చంద్రబాబు... చైనా వాళ్లతో మాట్లాడి బ్రహ్మపుత్ర నీళ్లను గాని, కేంద్రంతో మాట్లాడి గంగానది నీళ్లను కాని గోదావరికి మళ్లిస్తానని చెప్పి పెట్టేశాడు.

అవన్నీ వింటున్న మోడీ... ఇతనేంటి ఉష్ణోగ్రతలు తగ్గిస్తానంటాడు, బ్రహ్మపుత్ర, గంగా నదులను ఇక్కడికి తెస్తానంటున్నాడు. ఇవన్నీ ప్రజలెలా నమ్ముతున్నారని మోడీ అడిగాడు. అందుకు వెంకయ్య... అతని జాతకమే అంత... అతను ఏం చెప్పినా ప్రజలు నమ్ముతారు... లక్ష కోట్ల రుణమాఫీ చేస్తానంటే నమ్మ లేదా, చేతిలో చిల్లిగవ్వ లేకుండా సింగపూర్ రాజధాని కడతానంటే నమ్మలేదా? మాటలతో కోటలు కట్టడం అంటారు కదా... మావాడు మాటలతో కోటలనే కాదు, సింగపూర్ లాంటి రాజధానులను కూడా కట్టగలడు. అదే అతడి టాలెంట్ అని చెప్పాడు. ఈ టాలెంట్ వుంటే ఐదేళ్లేం ఖర్మ చచ్చినంత కాలం ప్రధానిగా వుండిపోవచ్చనుకుంటూ మోడీ అక్కడ నుండి బయల్దేరాడు.

## మేషం



అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

వృత్తి ఉద్యోగ బాధ్యతల్లో జాగ్రత్తగా ఉండండి. వ్యాపార వర్గాలకు మంచి అభివృద్ధి ఆదాయముంటుంది. కొన్ని అదనపు ఖర్చులు తప్పవు. అనుకున్న పనులు ఓర్పు పట్టుదలతో జరపండి. అధికారులకు స్థాన చలనం కలదు. ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసికొనవద్దు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. భారీగా పెట్టుబడులు పెట్టవద్దు. కుటుంబ సౌఖ్యం లభించగలదు.

## వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

తొందరపాటుగా ప్రవర్తించడం, మాట్లాడటం చేయవద్దు. తగాదాలు వచ్చే అవకాశం ఉన్నది. వ్యాపార నిర్వహణలో కొద్ది సమస్యలుండినా అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత, కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం, శుభకార్యాలలో పాల్గొనడం ఉంటుంది. ఉద్యోగులకు మంచి సమర్ధత గౌరవాలుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఖర్చుల భారం పెరుగుతుంది. చేబదుళ్ళు ఋణం చేయవలసి రావచ్చు. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా ఉండి, సామాన్య ఆదాయం ఉంటుంది. అయితే ఇబ్బందులను అధిగమిస్తారు. కొత్త పెట్టుబడులకు, వ్యాపారాలకు అవకాశాలు లభించగలవు. బంధువులతో అధికారులతో సత్సంబంధాలు నెలకొంటాయి. పనులు ఆలస్యమైననూ అనుకూలించగలవు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగి ఆదాయం పెరుగుతుంది. కుటుంబ వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. ఏ విషయంలో కాని చేసే ప్రయత్నాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వృత్తి ఉద్యోగాలలో గుర్తింపు గౌరవాలుంటాయి. కుటుంబసభ్యులతో కొద్ది విభేదాలు ఉండినను సర్దుబాటు అగును. పెట్టుబడుల విషయంలో అగ్రిమెంట్లు కుదురుతాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వ్యాపార రంగంలో పురోభివృద్ధి రాబడి బాగుంటుంది. వృత్తి ఉద్యోగాలలో సమర్ధత బాగుంటుంది. అనుకున్న పనులకు ఆటంకాలు కలిగినా ఏదో ఒక విధంగా నెరవేరుతాయి. స్త్రీలకు అనారోగ్య సమస్యలుంటాయి. తొందరపాటు నిర్ణయాలు చేయవద్దు. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలుంటాయి. పనులందు టెన్షన్ పడకుండా జాగ్రత్తగా నిర్వహించండి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఉద్యోగులకు ఒత్తిడి, అదనపు పనిభారం బాధ్యతలు పెరుగుతాయి. ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం ఉంటుంది. రాజకీయ వర్గాలకు మార్పులు, ఒత్తిడి ఉంటుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. శుభ కార్యాలు నిర్ణయం కావడం జరుగుతుంది. ఉద్యోగార్ధులు ఇంటర్వ్యూలందు శ్రద్ధ పెట్టండి. బంధువర్గంతో సమస్యలు రావచ్చును. మిత్రుల సహకారం పొందుతారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 22.04.2016 నుండి
తేది. 28.04.2016 వరకు

ఈ వారం మేషంలో రవిబుధులు, సింహంలో గురు రాహువులు, వృశ్చికంలో కుజ శనులు, కుంభంలో కేతువు, మీనంలో శుక్రుడు, తుల వృశ్చిక ధనుస్సులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము: ముహూర్తములు

తేది 22 శుక్రవారం ఉదయం గంట 9.0 నుండి గంట 10.30లోగా మిధున లగ్నమున వివాహ గృహారంభ వ్యాపారాలు. రాత్రి గంట 9.45 నుండి 11.56లోగా ధనుర్లగ్నమున వివాహము.

తేది 27 బుధవారము ఉదయం 9.0 నుండి 10.54లోగా మిధున లగ్నమున గృహారంభ వివాహములు.

### చైత్ర మాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 22 | శుక్ర | పూర్ణిమ | ఉ॥ గం.9.23వ॥ |
| తేది. 23 | శని | పాడ్యమి | ఉ॥ గం.11.23వ॥ |
| తేది. 24 | ఆది | విదియ | ప॥ గం.1.19వ॥ |
| తేది. 25 | సోమ | తదియ | ప॥ గం.2.54వ॥ |
| తేది. 26 | మంగళ | చతుర్ది | సా॥ గం.4.21వ॥ |
| తేది. 27 | బుధ | పంచమి | సా॥ గం.4.41వ॥ |
| తేది. 28 | గురు | షష్ఠి | సా॥ గం.4.50వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వృత్తి ఉపాధి వ్యాపార రంగాలలో నిలద్రొక్కుకుంటారు. ఆదాయం పెరుగుతుంది. కొత్త పెట్టుబడులకు అవకాశాలు బాగుంటాయి. అనుకున్న పనులు సక్రమంగా జరిగినా నిదానంగా సాగుతాయి. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. శుభకార్య ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. బంధువుల రాకపోకలు పెరుగుతాయి. వ్యాపార ఒప్పందాలు జరగగలవు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ప్రభుత్వ పరమైన పనులందు ఆలస్యం జరుగుతుంది. ఉద్యోగులు అధికారులతోను పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. తొందరపాటు లేకుండా సంప్రదించి, ఆలోచన చేసి నిర్ణయాలు తీసికొనండి. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. ఉద్యోగార్ధులు దొరికిన అవకాశాలు వాడుకొనండి. వృత్తి ఉపాధి పథకాలు లాభసాటిగా ఉంటాయి. కోర్టు కేసులందు ఆలస్యం జరుగుతుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆర్థికంగా నిలద్రొక్కుకుంటారు. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలుండి ఆదాయం పెరుగుతుంది. శుభకార్యాలకు, దైవ కార్యాలకు సహాయపడతారు. ఖర్చులు అదనంగా ఉండినా ప్రయోజనకరంగా ఉంటాయి. కుటుంబ విలాసాలు, ఖర్చులు తప్పనిసరిగా ఉంటాయి. స్థిరాస్తుల కొనుగోలుకు అవకాశాలు లభిస్తాయి. ప్రభుత్వ ఋణాలు మంజూరు కాగలవు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆర్థిక ఒప్పందాలలో జాగ్రత్త వహించండి. వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది. సోదరవర్గంతో కొద్దిపాటి విభేదాలు ఇబ్బందులు ఉండవచ్చు. ఆరోగ్య విషయంలో శ్రద్ధ చూపి పరీక్షలు జరుపుకొనవలసి వస్తుంది. ఖర్చులు అదనంగా ఉండినా ఇబ్బంది కలుగదు. రావలసిన బాకీలకై కృషి చేస్తారు. కొత్త వ్యాపారాలకై ప్రయత్నాలు జరుగుతాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

అనుకున్న పనులు టెన్షన్ పెట్టినా విజయవంతంగా జరుపుతారు. ఉద్యోగార్ధులకు అవకాశాలు దొరుకుతాయి. ఉద్యోగులకు బాధ్యతలు పెరిగినా సమర్ధవంతంగా నిర్వహిస్తారు. కుటుంబ సౌఖ్యము బాగుంటుంది. శుభ కార్యాలు నిర్ణయం కావడం, దైవకార్యాలకు సహాయ పడటం జరుగుతుంది. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. స్థిరాస్తులు కొనే ప్రయత్నాలు జరగవచ్చును.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

కొత్త వ్యాపారాలకు, పరిశ్రమల స్థాపనలకు ప్రయత్నాలు చేస్తారు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. శుభకార్య ఖర్చులు, శుభకార్య నిర్ణయాలు జరుగగలవు. మీ సమర్ధత వల్ల ఎదుటివారిని ఆకట్టుకొంటారు. అనుకున్న పనులను విజయవంతంగా పూర్తి చేస్తారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసికొనండి. షేర్లు లాభిస్తాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

# నేత్రపర్వంగా రాములోరి కళ్యాణం



గుప్తాపార్కు వద్ద శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్



పోలీస్ క్వార్టర్స్‌లో శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న ఎస్పీ విశాల్‌గున్నీ

శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీ పలు ఆలయాల్లో రాములోరి కళ్యాణోత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. సీతా సమేత రాముల వారిని పెళ్లికొడుకుగా ముస్తాబు చేసిన అర్చకులు శాస్త్రోక్తంగా వివాహ వేడుకను నిర్వహించారు. ఈ ఘట్టాన్ని ప్రత్యక్షంగా తిలకించేందుకు భక్తులు సీతారాముల వారి ఆలయాల వద్ద బారులు తీరారు.

శబరి శ్రీరామక్షేత్రం ఆధ్వర్యంలో వేమాలశెట్టి బావిసత్రం స్థలంలో వేదపండితులు కళ్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. నెల్లూరుజిల్లా కలెక్టర్ ఎం.జానకి దంపతులు ముత్యాల తలంబ్రాలను, నెల్లూరుజిల్లా న్యాయమూర్తి కనకదుర్గా రావు దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. సాయంత్రం రామకోటి స్థూపంలో రామకోటి గ్రంథాలను నిక్షిప్తం చేశారు. భక్తులు విశేషంగా పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నెల్లూరు మూలాపేట పోలీస్‌క్వార్టర్స్‌లో సీతారామ కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. జిల్లా ఎస్పీ విశాల్ గున్ని ఆయన సతీమణి నేహాశర్మ పాల్గొని కళ్యాణం జరిపించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శరత్‌బాబు, ఏఆర్ ఏఎస్పీ సూరిబాబు, ఎస్‌బి డిఎస్పీ కోటారెడ్డి, నగర డిఎస్పీ రాముడు, ఏఆర్ డిఎస్పీ చెంచురెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు పాల్గొన్నారు.

తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో సీతారాముల కళ్యాణం వైభవంగా జరిగింది. విశేష పుష్పాలంకరణ, పుష్ప యాగం జరిగాయి. ట్రైలర్స్ కాలనీలోని రామాలయంలో సుంద రయ్య కాలనీలో కళ్యాణోత్సవాలు జరిగాయి. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

నెల్లూరులోని గుప్తాపార్క్ సెంటర్, ఫణతులవారి వీధి, మండపాలవీధి ప్రాంతాల్లో జరిగిన సీతారామ కళ్యాణాల్లో నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లా లని ఆకాంక్షించారు.

ఇస్కాన్ మందిరంలో మందిరం ఛైర్మెన్ సుకదేవస్వామి ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. ప్రశాంతినగర్‌లోని కోదండరామస్వామి ఆలయంలో, కొత్తూరు, శ్రామికనగర్, బుజబుజనెల్లూరు, వేదాయపాలెం, బ్రహ్మానంద పురం, చిన్నబజారు, పెద్దబజారు, నవాబుపేట, వెంకటేశ్వర పురంలోని రామాలయాల్లో సీతారామ కళ్యాణాలు జరిగాయి.

## మద్దతు ధర కోసం

# సోమిరెడ్డి ముమ్మర ప్రయత్నం



రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా ఈసారి నెల్లూరు జిల్లాలో ధాన్యం దిగుబడి బాగా వచ్చింది. ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తే జిల్లాలోని రైతాంగమంతా ఆర్థికంగా ప్రయోజనం పొందుతుందని భావించిన శాసనమండలి సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆ దిశగా తీవ్ర ప్రయత్నాలే చేస్తున్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, మద్దతుధర కల్పించాలని ఇంతకుముందే సీఎంను కోరిన సోమిరెడ్డి, తాజాగా బయట జిల్లాల రైస్‌మిల్లర్లతోనూ ధాన్యానికి గిట్టుబాటు ధరలు కల్పించడానికి చర్చలు జరుపుతున్నారు. ప్రస్తుతం కాస్తున్న ఎండలకు గింజ విరిగిపోతూ రేటు తగ్గుతోంది. తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లాలో బాయిల్డ్ రైస్ మిల్లులు భారీగా వున్నాయి. అక్కడ తయారయ్యే బాయిల్డ్ రైస్‌ను కేరళకు ఎగుమతి చేస్తుంటారు. ఆ జిల్లా రైస్ మిల్లర్లు నెల్లూరుజిల్లాలో రోజుకు 200లారీల వరకు ధాన్యం కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. ఈ నేపథ్యంలో సోమిరెడ్డి నల్గొండ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నాయకులతోనూ, నల్గొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డితోనూ చర్చలు జరిపారు. జిల్లాలో ధాన్యానికి మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయాలని సోమిరెడ్డి కోరారు. వారు కూడా అందుకు సమ్మతిస్తూ, తాము కేరళకు బియ్యం ఎగుమతి చేస్తే రెండు నెలల తర్వాత చెల్లింపులుంటున్నాయని, చెల్లింపులకు ఆమేరకు గడువిస్తే ఎంత ధాన్యం కొనుగోలు చేయడానికైనా తాము సిద్ధమేనని నల్గొండ రైస్‌మిల్లర్స్ స్పష్టం చేశారు. అలాగే ధాన్యం రవాణాలో గుంటూరు జిల్లా దాచేపల్లి సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఎదురవుతున్న ఇబ్బందులను వారు సోమిరెడ్డి దృష్టికి తేగా, ఆయన వెంటనే రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ శ్యామలరావ్‌తో మాట్లాడి ధాన్యం లారీలను అడ్డుకోవద్దని కోరారు.

## సాయి మందిరాల్లో

# శ్రీరామనవమి వేడుకలు



అద్దాల సాయిబాబా మందిరం వారి నగరోత్సవం

నెల్లూరు బాలాజీనగర్ శివారు పద్మావతి నగర్‌లోని సాయి దర్బార్ అద్దాల మందిరంలో శ్రీరామనవమి వేడుకలను 15వ తేదీ వైభవంగా నిర్వహించారు. షిరిడి సంప్రదాయ రీతిలో సాయినాథుని పూలరథం, వెండి పల్లకీలో నగరోత్సవం నిర్వహించారు. మత సామరస్యాన్ని చాటుతూ మేళతాళాలు, మంగళవాయిద్యాలు, విశేషపుష్పాలంకరణ, విద్యుద్దీపాల వెలుగులు, ఫకీర్ల జరబులతో గంధమహోత్సవం, జెండా ఉత్సవం వేడుకగా జరిగింది. షిరిడి సాయినాథుడి చిత్రపటాన్ని పూలరథంపై ప్రతిష్టించి, వెండి పల్లకిలో నగరోత్సవం జరిగింది. బాణాసంచా వేడుకల్లో ముస్లిం ఫకీర్ల విన్యాసాలు, మంగళవాయిద్యాలు, పండరిభజనలు, ఒంటెలు, గుర్రాల ప్రదర్శనలతో పద్మావతి నగర్, బాలాజీనగర్, ఏసి నగర్ మీదుగా నగరోత్సవం సాగింది. దేవస్థానం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి, సాయి దర్బార్ ట్రస్ట్, సత్సంగ్ సేవాదళ్ సభ్యులు పర్యవేక్షించారు.

అలాగే నెల్లూరు ట్రంకురోడ్డు గాంధీ బొమ్మ దగ్గరున్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో బాబా జయంతి, శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి షిరిడి హారతులు నిర్వహించారు. మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, విశేష ద్రవ్యాలతో పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన జరిగాయి. అనంతరం అన్న దానం, విశేష పూలంగి, పల్లకి సేవలు నిర్వహించారు. ఆలయ ఛైర్మెన్ మన్నెం అమరనాథ్‌రెడ్డి ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నెల్లూరు చిల్డ్రన్స్ పార్క్ సాయిసదన్ మందిరంలో శ్రీ షిరిడి సాయి సేవా సమాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాబా జన్మదిన వేడుకలు, గంధ మహోత్సవం వైభవంగా జరిగాయి.

# కళారంగాన్ని పరిరక్షించుకోవాలి

## - 'హరివిల్లు' పురస్కారాల సభలో డిప్యూటి స్పీకర్



జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటి స్పీకర్ మండలి బుద్ధప్రసాద్

కళారంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందని, కళాకారులను గౌరవించుకోవాల్సిన బాధ్యత మనందరిపై వుందని డిప్యూటి స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఆదివారం రాత్రి నెల్లూరు పురమందిరంలో హరివిల్లు క్రియేషన్స్ వారి ఆధ్వర్యంలో జరిగిన 'హరివిల్లు ఆత్మీయ పురస్కారాల ప్రదానోత్సవం'లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెలుగుభాష ఔన్నత్యాన్ని అందరూ గుర్తించాలని, మన సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. నెల్లూరుతో తనకున్న అనుబంధాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటూ, జిల్లాకు చెందిన ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి, మరుపూరు కోదండ రామిరెడ్డి, ప్రముఖ దాత రేబాల లక్ష్మీ నరసారెడ్డి తదితరులతో తనకున్న ఆత్మీయానుబంధాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, నాయకులు చేజర్ల వెంక టేశ్వరరెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, ప్రముఖ మిమిక్రీ కళాకారుడు భవిరి రవి, దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్, వాకాటి విజయకుమార్‌రెడ్డి, వీరిశెట్టి హజరత్‌బాబు తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం వివిధ రంగాల్లో విశిష్ట సేవ లందిస్తున్న వారికి హరివిల్లు పురస్కారా లను ప్రదానం చేశారు. పురస్కారా లందుకున్నవారిలో ప్రముఖ సాహితీవేత్త కాళిదాసు పురుషోత్తం, ప్రముఖ గాయకుడు పాటూరు శ్రీనివాసులు, సినీ దర్శకుడు కె.వి రమణ, పాత్రికేయుడు ముత్యాల సుందరరామ్, చిత్రకారుడు-రచయిత బి. కళాసాగర్, రచయిత్రి వై.శైలజ, డప్పు కళాకారుడు టి.శీనయ్య, హాస్యనటుడు కిరాక్ ఆర్‌పి, నృత్యకళాకారిణి కల్పన, మేకప్ ఆర్టిస్ట్ వనారస లక్ష్మీకాంతబాబు తదితరులున్నారు.

# రఘుకు అంబేద్కర్ జీవిత సాఫల్య పురస్కారం



రఘుకు పురస్కారం అందజేస్తున్న డా॥ బి.సంజీవనాయుడు

కర్నూలు జిల్లా ఎర్రగూడదారులో పిఎస్‌ఎస్ ఎడ్యుకేషనల్ డెవలెప్‌మెంట్ సొసైటి ఆధ్వర్యంలో డా॥ బిఆర్ అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా డా॥ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని నెల్లూరు జిల్లాకు చెందిన అభ్యుదయ రచయిత, ఉపకార్మిక కమిషనర్ రాచపాళెం రఘు ఆవిష్క రించారు. ఈ సందర్భంగా పిఎస్‌ఎస్ ఎడ్యుకేషనల్ డెవలెప్‌మెంట్ సొసైటి ఛైర్మెన్ డా॥ బి.సంజీవరాయుడు చేతులమీదుగా డా॥ బిఆర్ అంబేద్కర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును సామాజిక, సాహిత్య సేవలకు గుర్తుగా రాచపాళెం రఘు అందుకున్నారు.

# అంధ విద్యార్థులకు ఉపాహారం



నెల్లూరు ఏసి స్టేడియం స్మైల్ వాకర్స్ అసోసియేషన్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 16వ తేదీ ఉదయం నెల్లూరు దర్గామిట్టలోని విశ్వభారతి అంధుల పాఠశాల లోని విద్యార్థులకు ఉపాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు జక్కంపూడి కృష్ణయ్య, గణపం రాజగోపాలరెడ్డి, కొండా మాధవయ్య, మదార్, మస్తానయ్య, ఇస్మాయిల్, చంద్ర, శ్యాం, సుశీలాదేవి, సుధారాణి, వహీదా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 2016 జూనియర్ మరియు సీనియర్ ఇంటర్మీడియట్ ఫలితాలలో విశ్వసాయి విశిష్ట విజయాలు

క్రమశిక్షణగల డైరెక్టర్ల బోధన,పర్యవేక్షణ...క్రమం తప్పని ప్రణాళికలు...నిజాయితీతోకూడిన ఫలితాలు ... విశ్వసాయిలో వికసించిన స్టేట్ టాప్ మార్కులు

## JUNIOR INTER

### Bi.P.C

| Name | H.T.NO. | Marks | Out of |
|---|---|---|---|
| P.TEJO VARSHINI | 1608138441 | 435 | 440 |
| B.SAI PRATHYUSHA | 1608113444 | 434 | 440 |
| D.BHAVYA SPOORTHY | 1608118955 | 434 | 440 |
| N.SREE SRITHA | 1608118974 | 434 | 440 |
| B.PAVAN TEJA | 1608138412 | 434 | 440 |
| P.SAI SPANDANA | 1608138453 | 434 | 440 |
| D.MEGHANA | 1608141273 | 434 | 440 |
| V.HANSITHA | 1608122507 | 433 | 440 |
| S.N.MALLIKA SREYA | 1608138021 | 433 | 440 |
| K.N.M.YESHWANTH | 1608138028 | 433 | 440 |
| K.CHARITHA REDDY | 1608138402 | 433 | 440 |
| M.VEDAVYAS | 1608139485 | 433 | 440 |
| M.LEKNOWESH | 1608139985 | 433 | 440 |
| J.VINEETHA | 1608141753 | 433 | 440 |
| M.VARUN RAJ | 1608142578 | 433 | 440 |
| P.TEJA | 1608113452 | 432 | 440 |
| D.S.S.CHARITHA REDDY | 1608138451 | 432 | 440 |
| P.SRAVANI | 1608139961 | 432 | 440 |
| M.PEETHIKA | 1608141307 | 432 | 440 |

### M.P.C

| Name | H.T.NO. | Marks | Out of |
|---|---|---|---|
| S.VINEELA | 1608117970 | 465 | 470 |
| SD.ARSHIYA | 1608112776 | 464 | 470 |
| K.ROHITHA | 160814329 | 464 | 470 |
| P.KAVITHA | 1608114423 | 464 | 470 |
| K.HITESH ARAVIND | 1608119030 | 464 | 470 |
| J.REBEKAH SHARON | 1608114735 | 462 | 470 |
| S.SAMYUKTHA | 1608114777 | 462 | 470 |
| V.AASHRITH | 1608114903 | 462 | 470 |
| N.SAI SRIKAR | 1608119436 | 462 | 470 |
| SD.FOWZIA | 1608122542 | 462 | 470 |
| K.PAVITHRA | 1608140555 | 462 | 470 |

## SENIOR

### Bi P C

| Name | H.T.NO. | Marks | Out of |
|---|---|---|---|
| V.KEERTHI KRISHNA | 1608211390 | 988 | 1000 |
| M.CHITRA NIKITHA | 1608222415 | 986 | 1000 |
| D.SRAVANA LAKSHMI | 1608236656 | 986 | 1000 |
| Y.BHAVANA | 1608217493 | 985 | 1000 |
| A.VYSHNAVI | 1608212761 | 984 | 1000 |
| E.VEEKSHNAVIOLA | 1608214418 | 983 | 1000 |
| M.GAYATHRI | 1608216841 | 983 | 1000 |
| K.NAVYA SRI | 1608238135 | 983 | 1000 |
| P.SREE MANASA | 1608214299 | 982 | 1000 |
| G.VIJAYA BHASKAR | 1608236650 | 982 | 1000 |
| G.SAI VAMSI | 1608238505 | 982 | 1000 |
| C.SRAAVYA REDDY | 1608221025 | 981 | 1000 |
| M.REVANTH CHAKRAVARTHY | 1608235742 | 981 | 1000 |
| C.S.N.THANMAI | 1608236658 | 981 | 1000 |
| K.VAISHNAVI | 1608238855 | 981 | 1000 |

### M P C

| Name | H.T.NO. | Marks | Out of |
|---|---|---|---|
| A.SREE HARSHA | 1608216005 | 986 | 1000 |
| K.SAI KRISHNATEJA | 1608216564 | 985 | 1000 |
| P.SRI VIDYA | 1608238917 | 983 | 1000 |
| M.AASRITHA REDDY | 1608238926 | 983 | 1000 |

### COURSES OFFERED

- Bi.P.C. Directors Batch EAMCET,National Level Exams
- M.P.C. JOI (IIT-JEE) Programme. A/C
- Intensive Coaching Batches
  - Bi.P.C. EAMCET
  - M.P.C. EAMCET,JEE(NIT,IIT)

**2016 IPE లో 100% మార్కులు సాధించిన విద్యార్థులు**

మాథమాటిక్స్ - 286
ఫిజిక్స్ - 275
కెమిస్ట్రీ - 161
బోటనీ - 268
జువాలజీ - 240

Jr.Bipc లో 440 కి 425 కు మించి మార్కులు సాధించిన విద్యార్థులు - 89
Jr.Mpc లో 470 కి 450 కు మించి మార్కులు సాధించిన విద్యార్థులు - 54
Sr.Bipc లో 1000 కి 950 కు మించి మార్కులు సాధించిన విద్యార్థులు - 139
Sr.Mpc లో 1000 కి 950 కు మించి మార్కులు సాధించిన విద్యార్థులు - 53

**ఈ ఫలితాలన్నీ మా నెల్లూరు బ్రాంచి నుండి మాత్రమే**

Dr. N. Satyanarayana, G. Krishna Mohan's


# VISWASAI
## EDUCATIONAL SOCIETY
## JUNIOR COLLEGE
NELLORE

NELLORE ❖ Near ANNAMAIAH CIRCLE, MAGUNTA LAYOUT.PH:2330065,8886770470,9160670001,02,03,04

శ్రీరస్తు శ్రీ గణేశాయ నమః శుభమస్తు



# బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక



**తేది 29-04-2016 నుండి 03-05-2016 వరకు**

## శ్రీ షిర్డి సాయిబాబా మరియు శ్రీ యోగాంజనేయస్వామి వార్ల తృతీయ వార్షిక బ్రహ్మోత్సవ ఆహ్వానము

కొత్తూరు గ్రామం, ఇందుకూరుపేట మండలం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

స్వస్తిశ్రీ! దుర్ముఖినామ సంవత్సరం ఉత్తరాయణం చైత్రమాసం కృష్ణపక్షం సప్తమి శుక్రవారము నుండి ఏకాదశి మంగళవారం వరకు అనగా సరియగు

**తేది 29-04-2016 నుండి 03-05-2016 వరకు**

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ఇందుకూరుపేట మండలం, కొత్తూరు గ్రామం నందు వెలసిన శ్రీ షిర్డిసాయిబాబా మరియు శ్రీ యోగాంజనేయ స్వామి వార్ల 5 రోజుల తృతీయ వార్షిక బ్రహ్మోత్సవ కార్యక్రమములు నెరవేర్చుటకు, భగవంతుని అనుగ్రహంతో నిశ్చయించడమైనది.

## శ్రీ సాయిబాబా మందిర కార్యక్రమ వివరములు

**తేది 29-04-2016 శుక్రవారం ఉదయం గం॥ 8.00 లకు ప్రారంభం**

దేవతా ప్రార్ధన, గణపతి పూజ, పుణ్యాహవచనం, దేవనాంది, దీక్షాకంకణ ధారణం, మహా సంకల్పం, కృచ్ఛాచరణ, ఋత్విక్ వరణ, అష్టమూర్తి ప్రార్ధన, బ్రహ్మకూర్చహోమం, అథర్వశీర్ష్య గణపతి హోమం, పూర్ణాహుతి, మంగళహారతి, సాయంత్రం గం॥ 6.00ల నుండి రాత్రి గం॥ 9.00ల వరకు గణపతి పూజ, మండల దర్శనం, మండలారాధన, రాక్షోఘ్న పారాయణము, రాక్షోఘ్నహోమం, వాస్తు పూజ, స్వప్నకలశ స్థాపన, మహాపూజ, పూర్ణాహుతి, దిక్‌బలి, మహా మంగళహారతి.

**తేది 30-04-2016 శనివారం ఉదయం గం॥ 8.00 నుండి గం॥ 12.30 ల వరకు**

గణపతి పూజ, స్వస్తిపుణ్యాహం, నవగ్రహ హోమం, శాంతిప్రాయశ్చిత్త హోమం, అధివాస హోమం, గణపతి మూల మంత్ర హోమం, దత్తాత్రేయ హోమం, అయ్యప్ప హోమం, శ్రీ సాయిబాబా మూలమంత్ర హోమం, కళావృద్ధి హోమం, వసోధారహోమం, మహాహుతి, పూర్ణకళాసానిధ్య మరియు

## శ్రీ సాయినాథునికి కుంభాభిషేకం

తదుపరి మహామంగళ హారతి, సాయంత్రం గం॥ 6.00 నుండి గం॥ 8.30ల వరకు శ్రీ షిర్డి సాయిబాబా వారి మహాపూజ, పల్లకీసేవ, అష్టావధానసేవ, మహామంగళ హారతి.

---

## శ్రీ యోగాంజనేయ స్వామి మందిర కార్యక్రమ వివరములు

**తేది 01-05-2016 ఆదివారం ఉదయం గం॥ 8.30 నుండి గం॥ 12.00ల వరకు**

దేవతా ప్రార్థన, గణపతిపూజ, స్వస్తిపుణ్యాహం, మహాసంకల్పము, కృచ్ఛాచరణ, అష్టమూర్తి ప్రార్థన, బ్రహ్మ కూర్చహోమం, అథర్వ శీర్ష్య గణపతి హోమం, పూర్ణాహుతి, మంగళహారతి.

సాయంత్రం గం॥ 6.00 లనుండి రాత్రి గం॥ 9.30 ల వరకు గణపతిపూజ, రాక్షోఘ్నహోమం, సుదర్శన అస్త్ర మంత్రం హోమం, వాస్తుపూజ, సర్వతోభద్ర యంత్రారాధన పూజ, కలశస్థాపన పూజ, పూర్ణాహుతి, దిక్‌బలి, మంగళహారతి.

**తేది 02-05-2016 సోమవారం ఉదయం గం॥ 8.30 ల నుండి గం॥ 12.30 ల వరకు**

గణపతి పూజ, పుణ్యస్థానశుద్ధి హోమం, బింబశుద్ధి హోమం, ప్రసాదశుద్ధి హోమం, తత్వహోమం, అధివాసహోమం, స్నపనమండలపూజ, బ్రహ్మకలశ స్థాపన పూజ, దిశా హోమం, పూర్ణాహుతి. సాయంత్రం గం॥4.30 నుండి గం॥ 10.00 ల వరకు గణపతిపూజ, ప్రాయశ్చిత్తహోమం, అష్టావధానసేవ, మహామంగళహారతి తదుపరి శ్రీ షిర్డి సాయినాథ, శ్రీరామ, శ్రీ ఆంజనేయ పరివారదేవతామూర్తుల ప్రాకారోత్సవం, ఉత్సవబలి, గ్రామోత్సవం వైభవంగా జరుగును.

**తేది 03-05-2016 మంగళవారం ఉదయం గం॥ 8.00 ల నుండి**

గణపతి పూజ, పుణ్యాహం, స్నపనహోమం, శ్రీ యోగాంజనేయ మూలమంత్ర హోమం, కళావృద్ధి హోమం, వసోర్ధారము తదుపరి ఉ॥గం. 11.00 కు మహా పూర్ణాహుతి పూర్ణకళాసానిద్య

## శ్రీ యోగాంజనేయ స్వామివారికి బ్రహ్మకలశాభిషేకం

మహాపూజ, మహామంగళహారతి, సామూహిక ప్రార్థన, ఆశీర్వాద గ్రహణము ఈ విధముగా 5 దినములు జరుగు కార్యక్రములకు బంధుమిత్ర సమేతంగా విచ్చేసి శ్రీ షిర్డిసాయిబాబా మరియు శ్రీ యోగాంజనేయస్వామి వార్ల తీర్థప్రసాదములు స్వీకరించి, స్వామి వార్ల కృపాకటాక్షములకు పాత్రులు కావలసినదిగా కోరడమైనది.

ఆహ్వానించువారు : శ్రీమతి కలికి శ్రీలత - శ్రీ కలికి కోదండరామిరెడ్డి, ధర్మకర్తలు

శ్రీ షిర్డిసాయిబాబా మందిరం ట్రస్ట్, కొత్తూరు గ్రామం, ఇందుకూరుపేట మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

గమనిక : అన్నప్రసాద వితరణ 29-04-2016 నుండి 03-05-2016 వరకు ప్రతి రోజు మధ్యాహ్నం 12.00 గం॥ల నుండి ప్రారంభం.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com